ప్రజాశక్తి
శనివారం 6 జనవరి 2024
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

బెదిరింపులు.. కక్ష సాధింపులు



అనకాపల్లిలో నిరసన తెలుపుతున్న సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు (ఫైల్)

- సమ్మెపై ప్రభుత్వ చిందులు
- సమస్యలు పరిష్కరించకుండా కాఠిన్యం
- ఎస్ఎస్ఎ ఉద్యోగులకు తొలగింపు ఉత్తర్వులు
- శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని అంగన్‌వాడీలకు హెచ్చరికలు
- నేడు కలెక్టరేట్ వద్ద రిలే దీక్షలు
- ఉధృతమవుతున్న పోరాటం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

అంగన్‌వాడీ, సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. వారి సమ్మె పట్ల సానుకూలంగా వ్యవహరించి డిమాండ్లను నెరవేర్చాల్సింది పోయి బెదిరింపులకు దిగుతోంది. విధుల్లో చేరకపోతే తొలగిస్తామంటూ ఇప్పటికే వాయిస్ మెసేజ్‌లను అధికారులతో పంపిస్తోంది. ప్రకటనలు జారీ చేయిస్తోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుచేయకుండా మొండికేస్తోంది. ఈ క్రమంలోనే ఈ నెల 6 నుంచి విధుల్లో చేరని అంగన్‌వాడీలపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ప్రకటన జారీచేశారు. ఎస్ఎస్ఎ డైరెక్టర్ మరో అడుగు ముందుకేసి సమ్మెలోవున్న నాన్ టీచింగ్ స్టాఫ్‌కు తొలగింపు ఉత్తర్వులు జారీచేయాలని ఆదేశించారు. షోకాజ్ నోటీసులు అందుకున్న వారిని విధుల నుంచి తొలగించాలన్న ఆదేశాలతో జిల్లాలోని 20 మంది నాన్ టీచింగ్ స్టాఫ్‌కు తొలగింపు ఉత్తర్వులు జారీచేశారు. విధుల్లో చేరని ఉద్యోగులను తొలగిస్తామని వాయిస్ మెసేజ్ పంపిస్తున్నారు. దీంతో తొలగింపు ఉత్తర్వులు అందుకున్న కొంతమంది విధుల్లో చేరుతున్నారు. విధుల్లో చేరిన వారికి ఇచ్చిన తొలగింపు ఉత్తర్వులను అధికారులు వెనక్కు తీసుకుంటున్నారు. ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ, తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డైరెక్టరేట్ కార్యాలయానికి వెళ్లిన ఉద్యోగులకు తొలగింపు మిగతా 2లో..

బెదిరిస్తే భయపడేదిలేదు



అంగన్‌వాడీలు, ఎస్ఎస్ఎ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం బెదిరింపు చర్యలకు దిగడం మానుకోవాలి. సమ్మె చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్న ఆలోచన సరికాదు. సమంజసమైన డిమాండ్లను పరిష్కరించడానికి ప్రభుత్వం ముందుకురాకపోతే పోరాటం ఉధృతం చేస్తాం. భేషజాలకు పోకుండా న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి.

జి.కోటేశ్వరరావు, సిఐటియు అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి

వార్త మెయిన్‌లో..



బ్యాటింగ్ చేస్తున్న బెంగాల్ క్రీడాకారుడు

ఉత్సాహంగా ఆంధ్ర - బెంగాల్ రంజీ మ్యాచ్

8 నుంచి సంక్రాంతికి

ఆర్‌టిసి ప్రత్యేక బస్సు సర్వీసులు

సాధారణ ఛార్జీలే అమలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సంక్రాంతిని పురస్కరించుకొని ఈసారి 600 ప్రత్యేక సర్వీసులు నడపాలని ప్రజా రవాణా శాఖ ఆర్‌టిసి విశాఖపట్నం రీజినల్ కమిటీ నిర్ణయించిందని రీజనల్ మేనేజర్ ఎ.అప్పల రాజు తెలిపారు. ఈ నెల 8 నుంచి 20వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు నడుస్తాయన్నారు. ఛార్జీల పెంపు ఉండదని, సాధారణ ఛార్జీలే వసూలు చేస్తారని చెప్పారు. హైదరాబాద్, విజయవాడ, తిరుపతి, చెన్నయ్, భీమవరం, కర్నూలు వంటి దూర ప్రాంతాలకు 200 బస్సులు, రాజమండ్రి, కాకినాడ, మిగతా 2లో..

పండగ పూటా పస్తులేనా?

వార్త 5లో..

23 వరకూ కోర్టు విధుల బహిష్కరణ

వార్త 3లో..

బాధిత కుటుంబాలకు భరోసా : నారా భువనేశ్వరి

వార్త 4లో..



యూత్ ఫెస్ట్‌లో వేషధారణలతో ఆకట్టుకున్న విద్యార్థినులు

ఘనంగా యూత్ ఫెస్ట్

పలు రాష్ట్రాల నుంచి ఎయుకు విద్యార్థుల రాక

వార్త మెయిన్‌లో..

ఈ ఏడాది పలు ప్రాజెక్టులకు శ్రీకారం

- ఫిబ్రవరికి మల్టీలెవెల్ కార్ పార్కింగ్ సిద్ధం
- రూ.40 కోట్లతో గేమింగ్ జోన్‌గా వైశాఖి జల ఉద్యానవనం
- వనరులన్నింటినీ వినియోగించి రెవెన్యూ పెంచేందుకు కృషి
- విఎంఆర్‌డిఎ కమిషనర్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున



మాట్లాడుతున్న విఎంఆర్‌డిఎ కమిషనర్ మల్లికార్జున

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, ఎంవిపి.కాలనీ విలేకరి

గడిచిన 9 నెలలకుగానూ రూ.161 కోట్లు ఆదాయం విఎంఆర్‌డిఎ ఆర్జించగా వ్యయం రూ.215 కోట్లు అయ్యిందని, ఫిబ్రవరిలోగా రూ.50 కోట్లు రావొచ్చని భావిస్తున్నామని, భవిష్యత్తులో వనరులన్నిటినీ వినియోగించి ఆదాయం పెంచుతామని విఎంఆర్‌డిఎ కమిషనర్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున వెల్లడించారు. ఈ ఏడాది పలు ప్రాజెక్టులకు శ్రీకారం చుడతామని తెలిపారు. శుక్రవారం సాయంత్రం సిరిపురం జంక్షన్‌లోగల విఎంఆర్‌డిఎ చిల్డ్రన్ థియేటర్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విఎంఆర్‌డిఎ ఆధ్వర్యాన నిర్మాణంలో ఉన్న పలు ప్రాజెక్టుల వివరాలు వెల్లడించారు. 11 అంతస్తుల మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ ఈ ఏడాది ఫిబ్రవరిలో అందుబాటులోకి రానుందన్నారు. 1050 వాహనాలను దీంట్లో పార్కింగ్ చేసుకోవచ్చన్నారు. వైశాఖి జల ఉద్యానవనం నాలుగు ఎకరాల్లో ఉందని, దీన్ని రూ.40 కోట్లతో గేమింగ్ జోన్‌గా మార్చే డిపిఆర్ సిద్ధం చేశామని తెలిపారు. కాలేజీ చదువులోపు పిల్లలకు ఇది ఎంతగానో తోడ్పడుతుందన్నారు. ఉడా పార్కు దగ్గర ఫైవ్ స్టార్ హోటల్‌ను పిపిపి విధానంలో చేపడతామని, రూ.100 కోట్లుగా దీన్ని అంచనా వేస్తున్నామని అన్నారు. న్యాయపరమైన సలహాలు తీసుకున్నాక పని ప్రారంభిస్తామన్నారు. ఎన్ఎడిపై ఆర్ఒబి 25 శాతం పూర్తయ్యిందని, 9 నెలల్లో దీన్ని పూర్తిచేస్తామని అన్నారు. నగరంలో ఇతర చోట్ల ఫ్లై ఓవర్‌లకు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

బెదిరింపులు.. కక్ష సాధింపులు

ఉత్తర్వులు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే జిల్లా నుంచి విజయవాడ వెళ్లిన వారి వివరాలు సేకరిస్తున్నారు. ఉద్యోగులు సమస్యలు పరిష్కరించుకోవడానికి చేస్తున్న సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు ఇలా ప్రభుత్వం అప్రజాస్వామిక చర్యలకు దిగుతోంది.

జనవరి ఐదులోపు విధుల్లో చేరని అంగన్‌వాడీలపై ప్రభుత్వ నిబంధనల ప్రకారం శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పట్టాన్‌శెట్టి ప్రకటన విడుదల చేశారు. ఈ బెదిరింపులకు భయపడకుండా అంగన్‌వాడీలు పోరాటం ఉధృతం చేస్తున్నారు. శనివారం కలెక్టరేట్ వద్ద రిలే నిరాహారదీక్షలు చేపట్టనున్నారు. సుప్రీంకోర్టు తీర్పును గౌరవించి గ్రాట్యూటీ చెల్లించాలని వారు కోరుతున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం తెలంగాణ ప్రభుత్వం కంటే వేతనం ఎక్కువ చెల్లిస్తామన్న మాటను అమలుచేసి నిలబెట్టుకోవాలని అడుగుతున్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పిల్లల మెనూ ఛార్జీలు పెంచాలని మొత్తుకుంటున్నారు. ఇవన్నీ న్యాయమైన డిమాండ్లు అయినప్పటికీ ప్రభుత్వం పరిష్కరించే మార్గాలు అన్వేషించకుండా అణచివేత చర్యలకు దిగుతోంది.

ఎస్ఎస్ఎలో వివిధ కేటగిరీల్లో పనిచేస్తున్న ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని, లేదంటే అంతవరకు మినిమం టైమ్ స్కేల్ సహా హెచ్ఆర్ఎ, డిఎ వర్తింపజేయాలన్న ఉద్యోగుల డిమాండ్లలో న్యాయముంది. వాస్తవానికి వీటిని అమలుచేస్తామని ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. వాటిని ఎస్ఎస్ఎ ఉద్యోగులు అమలు చేయాలని కోరుతున్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని సమస్యలు పరిష్కరించకుండా కక్ష సాధింపు చర్యలకు దిగడం సరికాదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

ఈ ఏడాది పలు ప్రాజెక్టులకు శ్రీకారం

ఈ ఏడాది పనులు చేపడతామన్నారు.

ప్రాజెక్టుల పూర్తికి సన్నాహాలు

చేమలాపల్లి, ఎండాడలో వెయ్యి మంది కెపాసిటీగల కన్వెన్షన్ సెంటర్లు రెండు నిర్మాణం చేస్తున్నామన్నారు. ఈ సెప్టెంబర్ నాటికి ఇవి పూర్తవుతాయన్నారు. 2023లో జి 20, గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సదస్సులకు రూ.12 కోట్లు విఎంఆర్‌డిఎ ఖర్చుచేసి నగరం అంతటా ఆధునికీకరణ పనులు, రోడ్ల నిర్మాణం చేసిందన్నారు. తెన్నేటి పార్క్ ఎదురుగా ఉన్న పార్కింగ్ స్థలంలో 100 వాహనాలు నిలిపేలాగ అభివృద్ధి చేశామన్నారు. బీచ్ రోడ్డులోని సీ హారియర్ మ్యూజియంను ఇప్పటికే అందుబాటులోకి తెచ్చామన్నారు. ముంబయి తరహాలో సముద్రంలోకి 46 మీటర్లు డెక్ వెళ్లేలాగ ప్రాజెక్టును సిద్ధం చేశామన్నారు. ఫిబ్రవరిలో పనులు ప్రారంభిస్తామన్నారు. తెన్నేటి పార్కు వెనకాల ఫ్లోటింగ్ బ్రిడ్జి నిర్మాణం ప్రారంభించామని, ఈ ఏడాదిలో పూర్తవుతుందని తెలిపారు. రూ.57 కోట్లతో కైలాసగిరిపై సైన్స్ అండ్ టెక్నాలజీ పార్క్ (మ్యూజియం) నిర్మాణం చేస్తున్నామన్నారు. జిప్‌లైన్, స్కై సైకిల్స్ రెండు నెలల్లో అందుబాటులోకి వస్తాయన్నారు.

లే అవుట్ల ప్రణాళిక

ఇప్పటివరకూ 23 లే అవుట్లలో లక్షా 41 వేల మందికి పట్టాలు మంజూరు చేశామని, ఈ ప్లాట్లకు సంబంధించి రూ.200 కోట్ల ఖర్చుతో సదుపాయాలు ఏర్పాటు చేస్తామని అన్నారు. రైతులకు చెందిన 45 లే అవుట్లలోని 145 ఎకరాల్లో రూ.660 కోట్లతో మౌలిక వసతులు ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. తొలి విడత రూ.200 కోట్లు, తర్వాత రూ.300 కోట్లతో పనులు చేస్తున్నామన్నారు. జగనన్న కాలనీలకు సంబంధించి ఆరు లే అవుట్లలో 1280 ప్లాట్లు వేశామని, దాంట్లో ఇప్పటి వరకూ 400 ప్లాట్లు అమ్మామని తెలిపారు.

మాస్టర్ ప్లాన్‌లో రూ.58.7 కోట్లతో 9 రోడ్లు

మాస్టర్ ప్లాన్ ఆధారంగా ఇప్పటికే 9 రోడ్ల నిర్మాణాన్ని రూ.58.7 కోట్లతో చేపట్టామని, దాంట్లో మూడు ఇప్పటికే పూర్తయ్యాయని, మరో ఆరు నిర్మాణ ప్రగతిలో ఉన్నాయని అన్నారు. దీంట్లో నాలుగు రోడ్లుకు బీచ్ రోడ్డు నుంచి హైవేకు ఇంటర్ కనెక్టివిటీ ఇచ్చామన్నారు. ఈ సమావేశంలో విఎంఆర్‌డిఎ జాయింట్ కమిషనర్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి ప్రత్యేక బస్సు సర్వీసులు

అమలాపురం, విజయనగరం, బొబ్బిలి, సాలూరు, శ్రీకాకుళం, పలాస, టెక్కలి, సోంపేట వంటి ప్రాంతాలకు 400 బస్సు సర్వీసులు నడపాలని నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే ఈ నెల 10 నుంచి 14 వరకు హైదరాబాద్, విజయవాడ ప్రాంతాల నుంచి విశాఖపట్నం రాకపోకలు సాగించే సర్వీసుల్లో సీట్లు రిజర్వు అయిపోయాయన్నారు. మరో 27 ప్రత్యేక సర్వీసుల్లో కూడా రిజర్వేషన్ పూర్తయ్యిందన్నారు. డిమాండ్ ఉంటే రాత్రి కూడా ప్రత్యేక సర్వీసులు నడిపేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

ఐదు కాంప్లెక్సుల నుంచి ప్రత్యేక సర్వీసులు

విశాఖ రీజియన్‌లోని ద్వారకా బస్‌స్టేషన్, మద్దిలపాలెం, గాజువాక, స్టీల్ సిటీ, కూర్మన్నపాలెం కాంప్లెక్సుల నుంచి ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక సర్వీసులు నడిపేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అన్ని వార్డుల్లో తిరిగి పార్టీని పటిష్టం చేయటమే తన ప్రధాన లక్ష్యమని జనసేన విశాఖ నగర అధ్యక్షులు వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం ఉదయం శివాజీపాలెంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్, రాజు గౌడ్ పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మున్సిపల్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎపి జెఎసి అమరావతి స్టేట్ జనరల్ సెక్రటరీ పలిశెట్టి దామోదర్‌రావు అన్నారు. మున్సిపల్ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలపై ఈ నెల 7న నిర్వహించనున్న కార్యక్రమానికి అందరూ నగరంలోని గురజాడ కళాక్షేత్రానికి తరలిరావాలన్నారు. శుక్రవారం జేమ్స్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు.

8న ఆటో కార్మికుల నిరసన ర్యాలీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ ఈ నెల 8న జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి కలెక్టర్ ఆఫీస్ వరకు ఆటో కార్మికుల నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆటో కార్మికులకు కలిగే ఇబ్బందులను గుర్తించి, దీనిపై ఏం చేయాలన్నది ప్రభుత్వం, ప్రతిపక్ష పార్టీల నాయకులు ఆలోచించాలని కోరారు. తెలంగాణ, కర్ణాటకల్లో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించి పార్టీలు అధికారంలోకి వచ్చాయనే ఉద్దేశంతో ఎపిలో కూడా మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం ప్రయత్నాలు చేస్తున్నారే తప్ప ఇక్కడున్న పరిస్థితులు వారికి అర్థం కావడం లేదన్నారు. తొలుత ఆటో డ్రైవర్లు, మ్యాక్సీ వగైరా వాహనాల డ్రైవర్ల పరిస్థితులను అవగాహన చేసుకోవాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం మంచిదేనని, అదే సమయంలో ఆటో కార్మికులకు ఏం చేస్తారో, వారి ఉపాధిని ఎలా కాపాడుతారో పాలకులు చెప్పాల్సిన అవసరముందన్నారు. వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, డీజిల్, పెట్రోల్, గ్యాస్‌ను సబ్సిడీ ధరకు అందించాలని, జిఒ 21 రద్దు చేయాలని, ఆటో డ్రైవర్‌కి ఆదాయ మార్గాలు చూపాలని డిమాండ్ చేశారు.

సమావేశంలో మోటార్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.అప్పలరాజు, ఆటో యూనియన్ నాయకులు కెవి.రమణ, త్రినాధరావు, ఎల్.కుమార్ పాల్గొన్నారు.

శాలిహోత్ర ఎక్స్‌ప్రెస్ ప్రారంభం



వాహనాన్ని ప్రారంభిస్తున్న సంజయ్ ప్రకాష్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అనకాపల్లి జిల్లా అరబుపాలెం గ్రామంలో మొబైల్ వెటర్నరీ సర్వీసెస్ యూనిట్ 'శాలిహోత్ర ఎక్స్‌ప్రెస్'ను ఎస్‌బిఐ ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్ ప్రకాష్ జెండా ఊపి ప్రారంభించారు. బిఎఐఎఫ్ డెవలప్‌మెంట్ రీసెర్చ్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో ఎస్‌బిఐ ఫౌండేషన్ గ్రామ సేవా కార్యక్రమంలో భాగంగా దీనిని సమకూర్చింది. ఈ సందర్భంగా సంజయ్ ప్రకాష్ మాట్లాడుతూ ఈ ప్రత్యేక వాహనం, పశువైద్య బృందం ద్వారా రైతుల ఇంటి వద్దకే పశువైద్య సేవలను అందించనున్నట్లు తెలిపారు. రైతులలో పశుసంవర్ధక ఉత్తమ పద్ధతుల గురించి అవగాహన కల్పించడానికి టెలివిజన్ కూడా ఇందులో ఉందన్నారు. ఇండియన్ వెటర్నరీ సైన్సెస్ పితామహుడు శాలిహోత్ర గౌరవార్థం ఈ వాహనానికి శాలిహోత ఎక్స్‌ప్రెస్' అని పేరు పెట్టామని తెలిపారు. సంప్రదాయ, క్రమబద్ధీకరించబడిన సెమెన్ టెక్నాలజీని ఉపయోగించి కృత్రిమ గర్భధారణతో సహా తాజా పశువైద్య సేవలను ఈ వాహనం అందిస్తుందన్నారు. గ్రామాల్లో జంతు ఆరోగ్య శిబిరాలు, సంతానోత్పత్తి శిబిరాలు, ఇతర పశు సంక్షేమ కార్యకలాపాలు నిర్ణీత వ్యవధిలో నిర్వహించబడతాయన్నారు. రానున్న ఏడాదిలో 1200 మంది రైతులకు ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి బి.ప్రసాదరావు, బిఎఐఎఫ్ నుంచి ఎస్.గోపాల్ రెడ్డి, స్థానిక పశువుల పెంపకందారులు పాల్గొన్నారు.

17వ రోజుకు సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సమ్మెలో భాగంగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఎపి సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు శుక్రవారం నాటికి 17వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు పి.పుండరీకాక్ష, కార్యదర్శి ఎల్.చైతన్య మాట్లాడుతూ సమగ్ర శిక్షలో పనిచేస్తున్న అన్ని భాగాల ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలన్నారు. హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. లేకుంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

19 నుంచి మెటల్ ఫార్మింగ్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఇండియన్ మెషిన్ టూల్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (ఐఎంటిఎంఎ) ఆధ్వర్యంలో మెటల్ ఫార్మింగ్ ఎగ్జిబిషన్ ఎనిమిదో ఎడిషన్ బెంగుళూరు ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్ (బిఐఇసి)లో ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఐఎంటిఎంఎ ప్రెసిడెంట్ రాజేంద్ర ఎస్.రాజమనే తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఆయన మాట్లాడుతూ మెటల్ ఫార్మింగ్, మాన్యుఫ్యాక్చరింగ్ టెక్నాలజీలపై ఈ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నామన్నారు. టూల్‌టెక్ 2024 మెషిన్ టూల్ యాక్సెసరీస్, ఫార్మింగ్ టూల్స్, డై అండ్ మోల్డ్, మెట్రాలజీ, సిఎడి, సిఎఎం, డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్‌లో సంకలిత తయారీ, పరిశ్రమలో సరికొత్త ఆవిష్కరణలను కలిగి ఉందన్నారు. 4.0, వెల్డ్ ఎక్స్పో, వెల్డింగ్, కటింగ్ అసోసియేషన్‌తో అనుబంధం కోసం ఈ ప్రదర్శన చేపట్టామన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో 18 దేశాల నుంచి దాదాపు 500 మంది ఎగ్జిబిటర్లు పాల్గొంటారన్నారు.



నిరసన తెలుపుతున్న నీటి సరఫరా కార్మికులు

నీటి సరఫరా కార్మికుల నిరసన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : మున్సిపల్ వర్కర్లు చేపట్టిన సమ్మెకు మద్దతుగా జివిఎంసి వాటర్ ఫిల్టరేషన్ వర్కర్స్ కూడా సమ్మెలో భాగస్వాములవుతున్నారు. అందులో భాగంగా జివిఎంసి వాటర్ ఫిల్టరేషన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ దగ్గర వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు పి.వెంకట రెడ్డి, ప్రధాన కార్యదర్శి బి.ఆనంద్ కుమార్, కార్యదర్శి డి.శేఖర్ తదితరులు పాల్గొన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, స్కిల్డ్ వర్కర్లుగా గుర్తించి, స్కిల్ వేతనాలు ఇవ్వాలని నినాదాలు చేశారు.

సామాజిక సాధికార యాత్ర

జయప్రదానికి విస్తృత ప్రచారం

ప్రజాశక్తి- సీతమ్మధార :ఈనెల 6న ఉత్తర నియోజకవర్గంలో చేపట్టనున్న వైసిపి సామాజిక సాధికార యాత్ర విజయవంతం చేయాలని నియోజకవర్గ సమన్వయకర్త కెకె.రాజు కోరారు. శుక్రవారం ఇండస్ట్రియల్ ఎస్టేట్, త్రీస్టార్ వాకర్స్ పార్క్, మాధవధార, మురళీనగర్, తదితర ప్రాంతాలలో పర్యటించి ప్రజలు, సంఘాల పెద్దలు, వాకర్స్‌ను కలిసి, కరపత్రాలను పంచుతూ విస్తృత ప్రచారం చేశారు. 6నశుక్రవారం కైలాసపురం పోర్ట్ హాస్పిటల్ దరి ఇనార్బిట్ మాల్ రోడ్‌లో సభ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ అల్లు శంకరరావు, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ చల్లా రజనీ ఈశ్వరరావు, కార్పొరేటర్లు వావిలపల్లి ప్రసాద్ , జెసిఎస్ కన్వీనర్లు అమర్నాథ్ రెడ్డి, కృష్ణారావు, జిల్లా నగర ప్రధాన కార్యదర్శి మాసిన లక్ష్మి , బిసి డైరెక్టర్ నూకరాజు, ఎవిఎస్.రాజు, బాగది విజయ్, నీలి రవి ,ఎం.సునీల్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి- గాజువాక : సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో, ఆమెను ఆదర్శంగా తీసుకుని మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని డాక్టర్ ఎం.రమేష్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం జోగవానిపాలెంలో సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని మహిళలకు వంటల పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన అంకితకు మొదటి బహుమతి, శాంతికి రెండో బహుమతి, నాగమణికి మూడో బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్‌కుమార్ మాట్లాడుతూ, మహిళలు చదువుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు జి లక్ష్మి, నానాజీ క్యాటరింగ్ అధినేత ఎం నానాజీ, రాణి, నాగమణి లక్ష్మి పాల్గొన్నారు.

పలువురికి సంక్రాంతి కానుకలు

ప్రజాశక్తి- సీతమ్మధార : 44వ వార్డులో జివిఎంసి ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు ఈ సందర్భంగా విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర నెడ్‌క్యాప్ ఛైర్మన్ కె.కె.రాజు పాల్గొని పలువురికి సంక్రాంతి కానుకలు అందజేశారు. కార్యక్రమంలో గృహ సారథులు, ఆర్‌పిలు, కార్యకర్తలు పాల్గొన్నారు

పల్లెల అభివృద్ధి ధ్యేయం

ప్రజాశక్తి -పద్మనాభం : గ్రామీణ పల్లెల సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందని, వాటి పరిష్కారం, మౌలిక వసతుల కల్పనే తన లక్ష్యమని నాగోతు నాగమణి అన్నారు. శుక్రవారం మండలంలోని బి.తునివలస, పోరాడ వెంకటాపురం, రేవిడి, పద్మనాభం, తునివలస తదితర గ్రామాల్లో పర్యటించి తనను తాను పరిచయం చేసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో భీమిలి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని వెల్లడించారు.

పశువులకు వ్యాక్సినేషన్

ప్రజాశక్తి -పద్మనాభం: మండలంలోని అయినాడ గ్రామంలో గాలికుంటు వ్యాధినివారణకు 300 పశువులకు శుక్రవారం వ్యాక్సినేషన్ చేశారు రెడ్డిపల్లి పశువైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వెటర్నరీ సిబ్బంది వైద్యశిబిరం నిర్వహించి పశువులకు టీకాలు వేశారు. ఈ నెల 31వరకు గాలికుంటు వ్యాధి వ్యాక్సినేషన్ చేపడతామని, పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చూడిపశువులకు గాలికుంటు వ్యాధి సోకితే గర్భస్రావం అవుతుందని, అలాగే పాలదిగుబడి తగ్గుతుందన్నారు. నోట్లో పుండ్లు, చొంగ కార్చడం, కాలిడెక్కల వద్ద పుండ్లు వంటి లక్షణాలతో పశువులు వ్యాధి బారినపడకుండా ముందుగా ప్రభుత్వం ఉచితంగా అందించే వ్యాక్సినేషన్ పశువులకు విధిగా చేయించుకోవాలని సూచించారు.

అర్హులందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

ప్రజాశక్తి -ఆనందపురం : అర్హులందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని భీమిలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు కోరారు. శుక్రవారం వేములవలస గ్రామసభలో తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. వేములవలసలో పేదల ఇళ్లస్థలాలకు గుర్తించిన స్థలాన్ని మండలంలోని అన్ని గ్రామాల్లోని పేదలకు కేటాయించినా, కొన్ని అభ్యంతరాలతో పంపిణీ నిలిచిపోయిందన్నారు. ఈ నేపథ్యంలో గ్రామసభ పెట్టి, అర్హులను గుర్తించి అందరికీ ఇళ్లపట్టాలు ఇవ్వాలని కోరారు.

మెరుగైన వైద్యం అందించడంలో నిర్లక్ష్యం

అదానీ గంగవరం పోర్టు కార్మికుల నిరసన



పోర్టు గేటు వద్ద బైఠాయించి ఆందోళన చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి -గాజువాక : అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికునికి మెరుగైన కార్పొరేట్ వైద్యం అందించడంలో అదానీ గంగవరం పోర్ట్ యాజమాన్యం నిర్లక్ష్యవైఖరిని నిరసిస్తూ శుక్రవారం కార్మికులు నిరసన చేపట్టారు. ఇటీవల 44రోజులు సమ్మె చేసిన సమయంలో కుదిరిన ఒప్పందం మేరకు వేతనాలు చెల్లింపు, కార్మికులకు ఆరోగ్యకార్డులను అందజేసి కార్పొరేట్ వైద్యం అందేలా చర్యలు చేపడతామన్న హామీలు అమలు కాకపోవడంపై మండిపడ్డారు. గరికిన నూకరాజు అనే కార్మికుడు వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ, ఇఎస్ఐ హాస్పిటల్‌లో చేరగా, మెరుగైన వైద్యం కోసం కెజిహెచ్‌కు రిఫర్ చేశారని, యాజమాన్యంతో కుదిరిన ఒప్పందం అమలైతే అతనికి కార్పొరేట్ వైద్యం అందేదని అంటున్నారు. దీనికి యాజమాన్యం నిరాకరించడంతో శుక్రవారం మధ్యాహ్నం పోర్టు గేటు వద్ద బైఠాయించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గంగవరం పోర్ట్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నొల్లి తాతారావు మాట్లాడుతూ నిరసన సందర్భంగా పోర్టు యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం తరపున స్థానిక ఎమ్మెల్యే నాగిరెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికుడు నూకరాజుకు ఏదైనా జరిగితే దానికి ఎమ్మెల్యే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వాసుపిల్లి ఎల్లయ్య పేర్ల నూకరాజు గంటి పిల్లి అమ్మోరు అప్పలరాజు అప్పారావు పాల్గొన్నారు.

భూయాజమాన్య హక్కు చట్టం అమలుపై నిరసన

23 వరకూ కోర్టు విధుల బహిష్కరణ

సర్వసభ్య సమావేశంలో న్యాయవాదుల సంఘం తీర్మానం

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎపి భూయాజమాన్య హక్కు చట్టం రద్దు చేయాలని ఉద్యమిస్తున్న న్యాయవాదులు ఈనెల 23వ తేదీ వరకు కోర్టుల విధులను బహిష్కరించాలని నిర్ణయించారు. న్యాయవాదుల సంఘం గ్రంథాలయం హాల్‌లో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వానికి ఉద్యమ తీవ్రతను చూపించడానికి ప్రతి ఒక్క న్యాయవాది రిలే నిరాహార దీక్షల్లో పాల్గొనాలని నిర్ణయించారు. ఈచట్టం వల్ల రైతులు, ప్రజలకు కలిగే నష్టాలను వివరిస్తూ, కరపత్రాలను తయారు చేసి, ముఖ్యకూడళ్లలో ప్రజలకు వివరించాలని తీర్మానించారు. అప్పటికీ రాష్ట్రప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 60 వేల మంది న్యాయవాదులను సమీకరించి, విజయవాడలో భారీ ప్రదర్శన నిర్వహించనున్నట్లు వెల్లడించారు. న్యాయవాదుల సంఘం అధ్యక్ష ప్రధానకార్యదర్శులు చింతపల్లి రాంబాబు, పైలా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో సీనియర్ న్యాయవాదులు యుఎస్ఆర్ రాజు, బివి రామాంజనేయరావు, ఐఎం అహమ్మద్, రెడ్డి నాయుడు, ఎన్‌వి సుమన్, బండారు రామకృష్ణ, బి సత్యనారాయణ, రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్లు పి నర్సింగరావు, బైపా అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

ముగిసిన 'ఆడుదాం ఆంధ్రా' క్రికెట్

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 40వ వార్డు హిందుస్థాన్ షిప్‌యార్డు గ్రౌండ్‌లో ఆడుదాం ఆంధ్రా క్రికెట్ పోటీలు శుక్రవారంతో ముగిసాయి. గతనెల 26న నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనందకుమార్ ప్రారంభించగా, పదిరోజులుగా ఉత్సాహంగా పోటీలు సాగాయి. శుక్రవారం క్రికెట్ తుదిపోరు సందర్భంగా ఫైనల్‌కు చేరిన రెండు జట్లుకు స్థానిక కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, సచివాలయ సెక్రటరీ రాజబాబు స్పోర్ట్స్ జెర్సీలను అందజేశారు. ముగింపు పోటీలో అప్పలరాజు టీం విజేతగా నిలిచింది.

సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం

ప్రజాశక్తి - ములగాడ : జివిఎంసి 61వ వార్డు వెంకన్నపాలెంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు పాల్గొన్నారు. టిడిపి, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించారు. జనతా కాలనీ నుంచి నాగోతి సూర్యనారాయణ ఆధ్వర్యంలో పలువురు యువత టిడిపిలో చేరగా, వారికి పార్టీ కండువాలు వేసి ఎమ్మెల్యే గణబాబు ఆహ్వానించారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు మజ్జి సోమేష్, కాకి పోలిరెడ్డి, సర్వసిద్ధి శ్రీలక్ష్మి, పాసిన.చిన్న, చింతలపూడి సత్యనారాయణ, జయశంకర్, దేవిడ్, చిన్నారావు సూర్యనారాయణ పాల్గొన్నారు

పంచాయతీరాజ్ వ్యవస్థ కీలకం

ప్రజాశక్తి -ములగాడ : అధికార వికేంద్రీకరణకు, ప్రజాస్వామ్యం విజయవంతానికి, స్థానిక సమస్యల సత్వర పరిష్కారానికి పంచాయతీరాజ్ వ్యవస్థ కీలకమని రాజనీతిశాస్త్రం అధ్యాపకురాలు ఇపిఎస్. భాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారంసెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాలలో రాజనీతిశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'పంచాయతీరాజ్ వ్యవస్థ - తీరు తెన్నులు' అంశంపై సదస్సు నిర్వహించారు. అధ్యాపకులు వై. అనసూయా దేవి, ప్రిన్సిపల్ డాక్టర్ ప్రేమకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలభాను విద్యాలయాన్ని సందర్శించిన విదేశీ ప్రతినిధులు

ప్రజాశక్తి -మాధవధార : మురళీనగర్‌లోని బాలభాను విద్యాలయాన్నిస్విట్జర్లాండ్, స్పెయిన్, అమెరికా విదేశీ ప్రతినిధుల బృందం శుక్రవారం సందర్శించింది. పాఠశాలలో అన్ని తరగతులకు వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. భారతీయ విద్యావిధానం అద్భుతంగా ఉందని ప్రశంసించారు. స్కూల్ డైరెక్టర్ కెసిఎస్ ప్రసాద్, జగద్గురు పీఠం డైరెక్టర్ పి.రవిశంకర్, పి.సందీప్, బాలభాను విద్యాలయం ప్రిన్సిపల్ శుభశ్రీ, టి.మనో రమణి, సిహెచ్ రమణారావు, పాల్గొన్నారు.

పాఠశాలకు థీమ్ పెయింటింగులు

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం గుడివాడ పంచాయితీ, శ్రీరామ్‌నగర్ ఎంపిపి పాఠశాలలో చిప్పాడ దివీస్ సిఎస్ఆర్ నిధులు రూ.1.04లక్షలతో థీమ్ పెయింటింగులను వేశారు.ఈ సందర్భంగా దివీస్ సిఎస్ఆర్ అధికారి డి సురేష్‌కుమార్ మాట్లాడుతూ, పలురంగులతో వేసిన అందమైన చిత్రాలు విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం జనార్ధనరావు, సిఎస్ఆర్ ప్రతినిధులు శ్రీనివాసరావు, పి శేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-గాజువాక :జివిఎంసి 87వవార్డు వడ్లపూడిలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌ఛార్జి కోమటి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద, జిల్లా కార్యదర్శి ప్రగడ వేణుబాబు, మార్పు శేషు, బిసిసెల్ జిల్లా కార్యదర్శి, సచివాలయం కన్వీనర్ దుగ్గపు దానప్పలు, సిహెచ్‌వి రమణ, ఎన్నేటి రమణ, బొండా గోవిందరాజులు, ప్రగడ శ్రీనివాస్, కోమటి రమా దేవి, సచివాలయం కన్వీనర్స్, పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గోస్తనీ నదిలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి -పద్మనాభం: మండలంలోని పాండ్రంగి పంచాయతీ సామయ్యవలస గ్రామానికి చెందిన శానాపతి రాము (34) శుక్రవారం గోస్తనీ నదిలో పడి మృత్యువాత పడ్డాడు. నదిలో ముఖం కడుక్కునేందుకు వెళ్లిన రాము ప్రమాదవశాత్తు నీటిలో జారిపడడం వల్లే మృతి చెందాడని అతని భార్య ఎస్ వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పద్మనాభం సిఐ సన్యాసినాయుడు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు.

120 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని చిన్నాపురం జంక్షన్‌లో శుక్రవారం ఉదయం వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులకు రూ.ఆరు లక్షల విలువ చేసే 120కిలోల గంజాయి పట్టుబడిందని పద్మనాభం సిఐ సన్యాసినాయుడు తెలిపారు. చిత్రకొండ నుంచి ఒడిశా మీదుగా విశాఖకు కారులో గంజాయిని తీసుకొస్తుండగా, పట్టుకుని ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశామన్నారు. గంజాయిని, కారును సీజ్ చేశామన్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని వడ్డాదిలో గురువారం రాత్రి అక్రమంగా రవాణా చేస్తున్న మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ డి ఈశ్వరరావు తెలిపిన వివరాలు ప్రకారం... వడ్డాదిలో గురువారం రాత్రి వాహనాల తనిఖీ చేస్తుండగా, వడ్డాదికి చెందిన గండి బోయిన అప్పారావు 96 క్వార్టర్ సీసాలు, 6 బీర్ సీసాలను రవాణా చేస్తుండగా పట్టుబడ్డారు. దీంతో ఆయన్ను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. అలాగే అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఒక ట్రాక్టర్ పై కేసు నమోదు చేసి, జరిమానా విధించారు. చింతపాక గ్రామానికి చెందిన వ్యక్తి నాటుసారా అమ్ముతుండగా అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. ఈ మేరకు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆటో డ్రైవర్ల మెరుపు ధర్నా

ప్రజాశక్తి- ములగాడ : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆటోడ్రైవర్లు శుక్రవారం మెరుపు ధర్నా నిర్వహించారు. దీంతో పారిశ్రామిక ప్రాంతంలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.పలు బస్‌స్టాపుల వద్ద గుంపులు గుంపులుగా జనం వేచియుండడంతోపాటు సిటీ బస్సుల్లో వేలాడుతూ ప్రయాణించారు. ఈ ప్రాంతంలో ఉదయంపూట విధులకు వెళ్లే ఉద్యోగులు, కార్మికులతోపాటు విద్యార్థులు ఎక్కువగా ఆటోలను ఆశ్రయిస్తూ ప్రయాణిస్తుంటారు. ఈ నేపథ్యంలో వారి సమ్మెతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు.

హాకర్స్ జోన్ ఏర్పాటు చేస్తాం

ప్రజాశక్తి- వేపగుంట : జివిఎంసి 52వ వార్డు ఎన్ఎడి నుంచి కరాసా పోవు రహదారిలో చర్చి నుంచి కరాసా వరకు హాకర్స్ జోన్ ఏర్పాటుతో తోపుడుబళ్లు, వీధివ్యాపారులకు ఇబ్బందులు లేకుండా చేస్తామని నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ హామీనిచ్చారు. శుక్రవారం ఎన్ఎడి నుంచి మర్రిపాలెం వరకు బిఆర్‌టిఎస్ రోడ్డుపక్కన ఉన్న చిరువ్యాపారులు, తోపుడుబళ్ల కార్మికులు ఆయనను కలిసి, ట్రాఫిక్ పోలీసులు, జివిఎంసి అధికారులతో అనునిత్యం తాము పడుతున్న ఇక్కట్లును వివరించారు. దీనిపై జియ్యాని స్పందిస్తూ కరాసా రోడ్డులో ఏర్పాటు చేసే హాకర్స్‌జోన్‌లో చిరువ్యాపారులు తమ దుకాణాలను పెట్టుకోవచ్చని, దీనికి తనవంతు సహకారం ఉంటుందన్నారు.

పైపులైన్ లీకేజీ పరిశీలన

జివిఎంసి 52వ వార్డు సుబ్రహ్మణ్యేశ్వర గుడి వద్ద తాగునీటి పైపులైన్ పదిరోజులుగా లీకౌతూ, నీరు వృధాగాపోవడమే కాకుండా ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో శుక్రవారం డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఆయాప్రాంతాలలో పర్యటించి, పరిశీలించారు. పైపులైన్ లీకేజిపై సంబంధిత అధికారులతో ఫోనులో మాట్లాడి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

చైతన్య స్కూల్ విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి- గాజువాక : ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ (ఐఎన్‌టిఎస్‌ఒ)లో గాజువాక చైతన్యనగర్‌లోని చైతన్య టెక్నో పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. ఇటీవల ఆఫ్‌లైన్‌లో సబ్జెక్టుల వారీగా నిర్వహించిన పరీక్షల్లో 163 మంది చైతన్య విద్యార్థులు ఉత్తీర్ణులైయారు. ప్రతిభ చూపిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపల్ అరుణకుమారి, ఎజిఎం సురేష్, ఆర్‌వి రమణ అభినందించి, సర్టిఫికెట్లను అందజేశారు.

ప్రభుత్వ నిర్బంధాన్ని ఖండించండి

సమ్మె చేస్తున్న కార్మికులకు స్టీల్ సిఐటియు సంఘీభావం



ధర్నా చేస్తున్న స్టీల్ సిఐటియు నేతలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : అంగన్వాడీ, మున్సిపల్, సర్వశిక్ష అభియాన్ కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వ నిర్బంధాన్ని తీవ్రంగా ఖండించాలని స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె అయోధ్యరామ్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్టీల్ సిఐటియు, సిఐటియు కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ ఆధ్వర్యంలో స్టీల్ ప్రధాన పరిపాలన భవనం వద్ద వీరికి సంఘీభావంగా ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి అయోధ్యరామ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు చేసిన వాగ్దానాన్ని నెరవేర్చమని నిరసన చేస్తున్న వారిపై నిర్బంధం దుర్మార్గమన్నారు. కనీస వేతనాలు, గ్రాట్యూటీ చెల్లింపుపై సుప్రీంకోర్టు ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ మొండిగా వ్యవహరించడం సరికాదన్నారు.

స్టీల్ సిఐటియు ప్రధానకార్యదర్శి యు రామస్వామి మాట్లాడుతూ మున్సిపల్ సమ్మెతో పారిశుధ్యం క్షీణించి, ప్రజారోగ్యంపై దాని ప్రభావం పడకముందే కార్మికుల సమస్యలను సానుకూలంగా పరిష్కరించి, సమ్మె విరమణ చర్యలు చేపట్టాలన్నారు. స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటిదాస్, యూజ్ ప్రధాన కార్యదర్శి కె పరంధామయ్య, స్టీల్ సిఐటియు నాయకులు పి శ్రీనివాసరాజు, బి అప్పారావు, కె గంగాధర్, స్టీల్ సిఐటియు ఒప్పంద కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి నమ్మి రమణ, అధ్యక్షులు జి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు వివి రమణ, వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు, కార్మికులు పాల్గొన్నారు.

నేడు 'అవంతి'లో గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి-తగరపువలస : స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 6న మధ్యాహ్నం 3గంటలకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి మురళీకృష్ణ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. తగరపువలస, మాకవరపాలెం, బసవపాలెం, గరివిడిలోని అవంతి విద్యాసంస్థల్లో పట్టభద్రులైన ఇంజనీరింగ్, ఫార్మసీ విద్యార్థులు 800 మందికి పతకాలు, సర్టిఫికెట్లు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. 750 మందికి ఉద్యోగ నియామకపత్రాలు అందజేస్తామన్నారు. అవంతి విద్యా సంస్థల చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, సిపి డాక్టర్ ఎ.రవిశంకర్, విశాఖ ఎన్ఎస్టిఎల్ డైరెక్టర్ అబ్రహం వర్గీస్, ఎపిఎస్సిహెచ్ఇ వైస్చైర్మన్ కె.రామమోహనరావు పాల్గొంటారన్నారు.

అప్సా కేలండర్, డైరీ ఆవిష్కరణ



ఆర్జెడిని పుష్పగుచ్ఛంతో అభినందిస్తున్న అప్సా ప్రతినిధులు

ప్రజాశక్తి- విశాఖపట్నం : ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ పాఠశాలల సంఘం (అప్సా) విశాఖ జిల్లా శాఖ డెయిరీ, కేలండర్ను డిఇఒ ఎల్.చంద్రకళ, ఆర్జెడి ఎం.జ్యోతికుమారి ఆవిష్కరించారు. శుక్రవారం అప్సా సభ్యులు వారిని మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. డిఇఒ, ఆర్జెడి చేతులమీదుగా అప్సా కేలండర్, డైరీలను ఆవిష్కరించగా, వాటిని విద్యాశాఖ సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా అధికారులతో ప్రైవేట్ పాఠశాలల సమస్యలపై సంఘ నాయకులు చర్చించారు. అప్సా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జె.సోమశేఖర్, పి.భాస్కరరావు, సభ్యులు రామకృష్ణ, డి.శ్రీనివాస్, వాసు, వాసుదేవరావు, రమేష్ నాయుడు, సత్యనారాయణ, గోవింద్, తారకేశ్వర రావు పాల్గొన్నారు

పొర్లు దండాలు, సాష్టాంగ నమస్కారాలతో

వినూత్న నిరసన

11వ రోజుకు మున్సిపల్ కార్మికుల సమ్మె



పిఎం.పాలెంలో సాష్టాంగ నమస్కారం చేస్తూ కార్మికుల నిరసన

ప్రజాశక్తి -పిఎం పాలెం: మున్సిపల్ కార్మికుల సమ్మెపై ఉక్కుపాదం మోపుతూ, దౌర్జన్యాలు దాడులు చేయొద్దని, ఇచ్చిన హామీలే అమలు చేయాలని, జగన్మోహన్ రెడ్డి మనసు కరగాలని కోరుతూ శుక్రవారం 11వ రోజున మున్సిపల్ కార్మికులు వినూత్న నిరసన చేపట్టారు. మధురవాడ జోనల్ కార్యాలయం పొర్లు దండాలు, సాష్టాంగ నమస్కారాలు చేసి ప్రభుత్వాన్ని వేడుకున్నారు. సిఐటియు నాయకులు సిహెచ్ శేషుబాబు, జోన్ ఉపాధ్యక్షులు డి అప్పలరాజు, యూనియన్ నాయకులు బి రత్నం, ఈ జాన్ బి నర్సింగరావు, కె అచ్చియ్యమ్మ, బి దుర్గ, ఎస్ రాములమ్మ, గణేష్, యు రాజు పాల్గొన్నారు. టిడిపి బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు నిరసనలో పాల్గొని సంఘీభావం తెలిపారు.

పెందుర్తి : 94వ వార్డు వేపగుంట నుండి నాయుడుతోట వరకు మున్సిపల్ కార్మికులు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి యు.రాజు మాట్లాడుతూ పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలను ఐదేళ్లయినా అమలు చేయకుండా కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్న సిఎం జగన్పైప్రజలు తిరగబడే రోజు వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు పెంటరావు, చిన్న రావు పాల్గొన్నారు .

ములగాడ : మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మెలో భాగంగా మల్కాపురం జోన్లో చెత్త కుప్పల ముందు బైఠాయించి కార్మికులు నిరసన చేపట్టారు. జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు ఆర్.లక్ష్మణమూర్తి నాయకులు కె. రమణ సూరి బాబు, రాంబాబు, రాము, రైలుబాబు గొల్ల బాబు తిరుపతిరావు ఎన్ ఉమ, దేవి, దుర్గా పాప లలిత,



మల్కాపురంలో చెత్తకుప్పల ముందు బైఠాయించిన కార్మికులు

విశాఖ కలెక్టరేట్ : సమ్మెలో ఉన్న మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కారం చేయకుండా ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరించడం, పోటీ కార్మికులను తెచ్చి పనిచేయించడం సరైంది కాదని, ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయోగిస్తే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.కృష్ణారావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం జివిఎంసి జోన్ 3 కార్యాలయం వద్ద పెద్దఎత్తున జివిఎంసి కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా పోలీసులనుపయోగించి కార్మికులను అరెస్టులు చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు జెఆర్. నాయుడు, కె.కుమారి, ఆర్.శ్రీను, రమణ, రాజు, వినోద్, బేబి, జగదీశ్వరి, విజయ, కొండమ్మ పాల్గొన్నారు.



జివిఎంసి జోన్ 3 కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

వెంకటేశ్వర థియేటర్ వద్ద ఉన్న జోన్ 4 కార్యాలయం వద్ద జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. యూనియన్ అధ్యక్షులు టి.నూకరాజు, సహాయ కార్యదర్శి ఎం.ఈశ్వరరావు, సిఐటియు సీనియర్ నాయకులు వై.రాజు తదితరులు ఈ సందర్భంగా మాట్లాడారు. రూ.26 వేలు వేతనం ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. లక్ష్మి, సూరమ్మ, రాజేశ్వరి క్లాప్ డ్రైవర్లు పాల్గొన్నారు

గాజువాక: సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు శుక్రవారం జివిఎంసి గాజువాక జోనల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. మున్సిపల్ కార్మికుల యూనియన్ గౌరవ అధ్యక్షులు ఎం.రాంబాబు,గణేష్ నాగరాజు, మీనాక్షి, సత్యవతి, అప్పారావు, కె కిరీటం, వై చిన్నారి పాల్గొన్నారు.

మధురవాడ : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఏడవ వార్డు వాంబే కాలనీలో జగనన్న ఆరోగ్య సురక్ష, పింఛన్లపంపిణీకి వచ్చిన ఎమ్మెల్యేను కలిసేందుకు ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్, సిఐటియు నాయకులు ఆధ్వర్యంలో కార్మికులు వెళ్లగా పోలీసులు అడ్డుకోవడంతో ప్లకార్డులు ప్రదర్శించి, నినాదాలు చేస్తూ నిరసన చేపట్టారు. చివరకు కేవలం ఐదుగురిని మాత్రమే ఎమ్మెల్యేను కలిసేందుకు పోలీసులు అనుమతించగా, తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి హయాంలో రూ.ఆరువేలు మాత్రమే ఉన్న వేతనాన్ని , వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. 18వేలకు పెంచారని, ఇంతకంటే ఎవరూ ఏం చేయలేరని ఎమ్మెల్యే ముత్తంశెట్టి వ్యాఖ్యలపై కార్మికులు నిరసన చేపట్టారు. ఆందోళనలో రాజ్కుమార్,ఎంవి ప్రసాద్, సిహెచ్ శేషుబాబు, కిరణ్, క్లాప్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు కె.సన్ని, ఎస్ చిన్న, బిఎ రెడ్డి పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: పట్టణంలో మున్సిపల్ కార్మికుల సమ్మె 11వ రోజున శుక్రవారం ఎన్టీఆర్ స్టేడియంలో పొర్లు దండాలు పెడుతూ నిరసన చేపట్టారు. సిఐటియు నేత ఈరెల్లి చిరంజీవి శ్రీను, రాజు, ప్రసాదు, రవి పాల్గొన్నారు.

అనకాపల్లి : తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ వర్కర్లు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం నాటికి 11వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ సంక్రాంతి పండగ సమీపిస్తున్న తమ డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపకపోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో సిఐటియు అధ్యక్షులు ఆర్. శంకరరావు, జి.సత్యనారాయణ, బొమ్మలు రాము, నిమ్మకాయల అజయ్ కుమార్, నూకరాజు, శివకుమార్, సంతోష్, గణేష్, శ్రీను, లక్ష్మణరావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు భరోసా

'నిజం గెలవాలి'లో పరామర్శించిన భువనేశ్వరి

ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల ఆర్థిక సాయం

ప్రజాశక్తి- కలెక్టరేట్/ గాజువాక, సీతమ్మధార : టిడిపి అధినేత చంద్రబాబు అరెస్ట్తో తీవ్ర మనోవేదనకు గురై కుటుంబ పెద్దలను కోల్పోయి శోకసంద్రంలో మునిగిన బాధిత కుటుంబాలకు అధైర్యపడొద్దు, అండగా తామున్నామంటూ చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి భరోసా ఇచ్చారు. 'నిజం గెలవాలి' ఉత్తరాంధ్ర పర్యటన మూడవ రోజు శుక్రవారం విశాఖపట్నంలోని ఉత్తర, దక్షిణ నియోజకవర్గాలతోపాటు గాజువాకలో పర్యటించారు.. చంద్రబాబు అక్రమ అరెస్టును జీర్ణించుకోలేక ఆకస్మిక మరణానికి గురైన కార్యకర్తల కుటుంబాలను భువనేశ్వరి పరామర్శించారు. నోవాటెల్ విడిది కేంద్రం నుండి ప్రారంభమైన భువనేశ్వరి నిజం గెలవాలి యాత్ర, ముందుగా దక్షిణ నియోజకవర్గం 33వ వార్డులో టిడిపి కార్యకర్త జాగరపు చిన్న(47) కుటుంబాన్ని పరామర్శించారు. చిన్న భార్య గౌరి, కుమార్తెలు దేవి, నందిని, కుమారుడు కిరణ్ లను భువనేశ్వరి పరామర్శించి ఓదార్చారు. అనంతరం 41వ వార్డులోని మలిశెట్టి రమణ(55) కుటుంబాన్ని పరామర్శించారు. రమణ కుమారుడు రాజు, కోడలు సంతోషి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని 45 వ వార్డులో పంచిరెడ్డి కనకారావు(52) కుటుంబాన్ని పరామర్శించారు. కనకారావు భార్య పార్వతి, కుమార్తె ఉదయశ్రీ, కుమారుడు శ్యామ్లను పరామర్శించారు. గాజువాక 65వ వార్డులోని కోరుకొండ వెంకటరమణ(61) కుటుంబాన్ని పరామర్శించారు. వెంకటరమణ భార్య మంగ, కుమారుడు శ్రీను, కుమార్తె లక్ష్మిల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇదే వార్డులోని ఉప్పలపాటి సరోజిని కుటుంబాన్ని పరామర్శించారు. సరోజిని భర్త వెంకట అప్పల నరసింహరాజు, కుమారుడు శ్రీనివాసరాజు, కోడలు సునీత, కుమార్తె లక్ష్మిలను పరామర్శించారు. 69వ వార్డులోని పమిడిముక్కల రాధాకృష్ణమూర్తి కుటుంబాన్ని పరామర్శించారు. రాధాకృష్ణమూర్తి కుమారులు వెంకట్రావు, ప్రభాకర్, కోడళ్లు స్వరాజ్యలక్ష్మి, శశికళ లతో మాట్లాడి వారిని ఓదార్చారు. ఒక్కో బాధిత కుటుంబానికి రూ.3లక్షల చొప్పున ఆర్థిసాయాన్ని చెక్కుల రూపంలో అందించారు. బాధిత కుటుంబాల పరామర్శ అనంతరం విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుని హైదరాబాద్ వెళ్లారు.

భువనేశ్వరికి ఘన స్వాగతం

'నిజం గెలవాలి'లో భాగంగా. గాజువాక విచ్చేసి భువనేశ్వరికి టిడిపి జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రసాదుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో గంధం శ్రీనివాసరావు. 67వ కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు. పులి వెంకటరమణారెడ్డి, టిఎన్టియుసి నేతలు రామ్మోహన్ కుమార్, నక్క లక్ష్మణరావు, నమ్మి సింహాద్రి. గోమాడ వాసు, సింగూర్



ఆర్థికసాయం చెక్కు అందజేస్తున్న భువనేశ్వరి

ఆనంత్, రట్టి వాసు బైబిల్ గాంధీ, మహ్మద్ రఫీ, చెరుకూరు నాగేశ్వరరావు, తెలుగు మహిళలు సరోజిని, రాంబాయి, జ్యోతి,భవాని, ఉష. గొలగాని వెంకన్న,.గాజువాక నియోజకవర్గ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అలాగే 45వ డివిజన్ తాడిచెట్లపాలెం పర్యటనలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే ఎమ్మెల్సీ లు వంగలపూడి అనిత, గండిబాబ్జి, సంధ్యారాణి, లలితకుమారి, కోరాడ రాజబాబు, విజయబాబు, బండారు అప్పలనాయుడు, టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు ప్రణవ్గోపాల్, అనంతలక్ష్మి,ఈతలపాక సుజాత పాల్గొన్నారు.

భువనేశ్వరిని కలిసిన జనసేన నేతలు

నిజం గెలవాలి పర్యటనకు విశాఖ వచ్చిన భువనేశ్వరిని నోవాటెల్ హోటల్లో చోడవరం నియోజకవర్గ జనసేన ఇన్ఛార్జి పివిఎస్ఎన్.రాజు,కార్పొరేటర్ మూర్తియాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. చంద్రబాబు అరెస్ట్ సమయంలో మృతి చెందిన కార్యకర్తల కుటుంబాలను పరామర్శించడం, అండగా ఉండడం నిబద్ధతకు నిదర్శనమన్నారు.

పండగ పూటా పస్తులేనా?

కలెక్టరేట్ వద్ద పంచాయతీ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి జిల్లాలో గ్రామపంచాయతీలలో పనిచేస్తున్న పంచాయతీ కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు ,గ్రీన్ గార్డుల బకాయి జీతాలు చెల్లించాలని కోరుతూ శుక్రవారం అనకాపల్లి కలెక్టర్ ఆఫీస్ వద్ద ఏపీ గ్రామ పంచాయితీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో నెలకు 3000 నుండి 6000 రూపాయల వేతనాలతో ప్రభుత్వం పంచాయతీ కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డులతో పనిచేయించు కుంటుందన్నారు. నేటికీ మూడు నెలల నుండి 13 నెలలుగా జీతాలు రాని పంచాయతీలు జిల్లాలో అనేకం ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చే అరకొర జీతం కూడా నెలల తరబడి చెల్లించకపోవడంతో పంచాయతీ కార్మికులు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. తక్షణమే బకాయి జీతాలు చెల్లించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కరోనా కాలంలో పారిశుధ్య కార్మికుల్ని దేవుళ్లగా పొగిడిన ప్రభుత్వాలు నేడు జీతాలు ఇవ్వడానికి ఇబ్బందులు పెడుతున్నాయని న్నారు. అనారోగ్యం పాలైన పారిశుధ్య కార్మికుల్ని ఆదుకునే దిక్కేలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బ్లీచింగ్లు పడి శరీరం గాయాల పాలవుతున్నారని, గతంలో యూనిఫామ్, చెప్పులు, సబ్బులు, గ్లోవ్జులు ఇచ్చేవారని నేడు ఎటువంటి రక్షణ పరికరాలు కూడా ఇవ్వడం లేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, యూనియన్ అధ్యక్షులు పలివెల చిన్నారావు, జిల్లా నాయకులు ములకలపల్లి అప్పలరాజు, మహేష్, అప్పారావు, ఈశ్వరరావు ,విజయ్ కుమార్, మహేష్ ,పరదేశి, చంద్రరావు, సన్యాసినాయుడు, దేవుడు పాల్గొన్నారు.



అనకాపల్లి కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు

పారిశుధ్య కార్మికుల నిరసన

గొలుగొండ: మండలంలోని ఏజెన్సీ లక్ష్మీపురంలో పారిశుధ్య కార్మికులు విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా సచివాలయం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ తమకు ఇస్తున్న రూ.6వేల జీతాన్ని రూ.18వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు విధుల్లోకి చేరేది లేదని స్పష్టం చేశారు.



నినాదాలు చేస్తున్న ఎల్.పురం పంచాయతీ కార్మికులు



అంగీకార పత్రాన్ని అందజేస్తున్న కంపెనీ ప్రతినిధులు

'రసూల్' మృతుని కుటుంబానికి రూ.35 లక్షల పరిహారం

ప్రజాశక్తి-అచ్యుతాపురం, రాంబిల్లి

రసూల్ డెక్కర్ పరిశ్రమలో విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందిన మనీష్ కుటుంబానికి 35 లక్షల రూపాయలు నష్టపరహారం చెల్లించడానికి పరిశ్రమ యాజమాన్యం అంగీకరించింది. పరిశ్రమ ఆవరణలో శుక్రవారం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ రాము, మృతుడు కుటుంబీకులు, భవన నిర్మాణ కార్మికులు ప్రతినిధులు తదితరుల సమక్షంలో పరిశ్రమ యాజమాన్య ప్రతినిధులు చర్చలు జరిపారు. ఈ చర్చల్లో భాగంగా 35 లక్షల రూపాయలు పరిహారంగా చెల్లించడానికి యాజమాన్యం ముందుకు వచ్చినట్లు రాము తెలిపారు. ఈ మేరకు అంగీకార పత్రం అందజేశారు. ఈ చర్చిలలో సిఐటియు నాయకులు జి దేవుడు నాయుడు, రాజాన అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్ తదితరులు

పంజాబ్ ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే స్వాగతం

ప్రజాశక్తి - పరవాడ : విశాఖ జెఎన్ ఫార్మాసిటీకి విచ్చేసిన పంజాబ్ ముఖ్యమంత్రి భగవనత్ మాన్‌కు గురువారం పెందుర్తి శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర సిఇసి సభ్యులు పైల శ్రీనివాసరావు, పరవాడ జడ్పీటీసీ పైల సన్యాసిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రాము నాయుడు, పెద్ద చెరువు రైతు సంఘం అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసరావు, ఎడ్ల నాయుడు, మట్ట ప్రసాద్, రాంకీ యాజమాన్యం ప్రతినిధులు పాల్గొన్నారు.

నేటి నుండి వికసిత్ సంకల్ప యాత్రలు

ప్రజాశక్తి-కె.కోటపాడు : ఈ నెల 6 నుండి 21వ తేదీ వరకు మండలంలోని 32 గ్రామపంచాయతీల్లో వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. శనివారం సూదివలస, పాతవలస గ్రామాల్లో ఈ యాత్రలు జరుగుతాయని, వీటిని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఉప ముఖ్యమంత్రిని కలిసిన ఉపాధి హామీ కౌన్సిల్ సభ్యులు

ప్రజాశక్తి-దేవరాపల్లి : ఎన్ఆర్ఇజిఎస్ రాష్ట్రస్థాయి కౌన్సిల్ సభ్యులుగా నియమితులైన బూరె బాబురావు, ముక్కమళ్ళ పుల్లారెడ్డి, అల్లు లావణ్య కుమార్, రాహుల్ నాయుడు, లంకిరెడ్డి మనోహర్‌రెడ్డి, టి.లక్ష్మి నరసింహులు శుక్రవారం మండలంలోని తారువ గ్రామంలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడుని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి ఇంతటి చక్కని అవకాశాన్ని కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి బూడికి హృదయ పూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.



ఉప ముఖ్యమంత్రి బూడికి పుష్పగుచ్ఛం అందిస్తున్న దృశ్యం

ఘనంగా మాజీ మంత్రి కొణతాల జన్మదిన వేడుకలు

పేదలకు దుప్పట్లు పంపిణీ



లక్ష్మీనారాయణకు కేక్ తినిపిస్తున్న కొణతాల అభిమానులు

ప్రజాశక్తి -అనకాపల్లి

అనకాపల్లి గవరపాలెం కరెంట్ ఆఫీస్ వద్ద మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ జన్మదిన వేడుకలను కొణతాల అభిమానులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వర్తక సంఘం అధ్యక్షులు కొణతాల లక్ష్మీనారాయణ రావు హాజరై పేదలకు చీరలు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ కొణతాల రామకృష్ణ 2004- 2009 మధ్య మంత్రిగా ఉన్నప్పుడు ఉత్తరాంధ్ర జిల్లాకు ముఖ్యంగా విశాఖ జిల్లాకు ఆయన చేసిన అభివృద్ధి, సేవలను కొనియాడారు. అనకాపల్లి జిల్లా ఏర్పడడానికి ముఖ్య భూమిక కొణతాల రామకృష్ణ పునాది వేశారని, గ్రేటర్ విశాఖపట్నంలో అనకాపల్లి పురపాలక సంఘానికి అప్పటి చైర్మన్ కడిమిశెట్టి మహాలక్ష్మి కౌన్సిల్లో తీర్మానం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి విశాఖ కార్పొరేషన్‌కి పంపించడం జరిగిందని చెప్పారు. మెయిన్ రోడ్ విస్తరణతో నేడు అనకాపల్లి టౌన్‌లో పెద్దపెద్ద కార్పొరేట్ సంస్థలు వస్తున్నాయంటే అందుకు కారకులు కొణతాల రామకృష్ణ అని కొనియాడారు. అనంతరం కేక్ కటింగ్ చేసి రామకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో తాళ్లపాలెంపాల సంఘం అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ, తుమ్మపాల ఎంపీటీసీ సభ్యులు చదరం నాగేశ్వరరావు, గౌరీ సేవా సంఘం కార్యదర్శి బుద్ధ రమణాజీ, మాజీ కౌన్సిలర్ పీలా నాగ శ్రీను, బుద్ధ రాజేష్, పీలా నాని, కొణతాల సందీప్, సూరిశెట్టి రాముడు, మాధవ, సుజీ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల ప్రక్రియ వేగవంతం

కలెక్టర్ రవి పట్టన్ శెట్టి

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలో అర్హులైన పాత్రికేయులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్‌లో జరిగిన జర్నలిస్టుల హౌసింగ్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలననుసరించి అక్రిడేషన్ ఇతర అర్హతలు గల విలేకరులు ఎంతమంది ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకున్నదీ వారిలో అర్హులైన వారికి ఎంత భూమి అవసరమున్నది లెక్క గట్టి వెంటనే తెలియజేయాలని సూచించారు. ఎంతమందికి ఇళ్ల స్థలాలు ఇవ్వవలసి వస్తున్నది, దానికి అవసరమైన ప్రభుత్వ స్థలాలు ఏఏ ప్రాంతాల్లో ఉన్నది వెంటనే తెలియజేయాలని ఆదేశించారు. ఇప్పటికే పరిశీలించిన దరఖాస్తులు ఆరవ తేదీ వరకు వచ్చే దరఖాస్తులలో ఎంతమంది అర్హులు ఉంటారో సుమారుగా తెలియజేయాలని జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కే.ఇంద్రావతిని ఆదేశించారు. ఎటువంటి అభ్యంతరాలు లేని అవసరమైన భూమిని గుర్తించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, నర్సీపట్నం ఆర్డిఓ హెచ్‌వి. జయరాం, కమిటీ సభ్యులు లోవరాజు, జోగి నాయుడు, స్వామి నాయుడు, డిఐపిఆర్ఓ కే.ఇంద్రావతి, డిపిఆర్ఓ డి.సాయి బాబా, సమాచార ఇంజనీర్ ఏ.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చోడవరం బీసీ హాస్టల్ వార్డెన్ సస్పెన్షన్

ప్రజాశక్తి -అనకాపల్లి

చోడవరం ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థులు క్రమశిక్షణారాహిత్యానికి పాల్పడ్డారని ఆరోపణల నేపథ్యంలో హాస్టల్ సంక్షేమాధికారి ఆర్.చిన్నయ్యను తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు సస్పెండ్ చేసినట్లు జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి కే.రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. చోడవరం బీసీ హాస్టల్‌కు చెందిన బాలుర అలవాట్లపై దురలవాట్లపై వైరల్ అయిన వీడియో నేపథ్యంలో ఆమె విచారణ జరిపారు.

ప్రజా సమాచారం ఇవ్వడానికి గోప్యత ఎందుకు?

ప్రజాశక్తి-అనకాపల్లి

స్వచ్ఛందంగా వెల్లడించాల్సిన ప్రజా ప్రయోజనాల సమాచారాన్ని కూడా గోప్యంగా ఉంచడం తగదని రాష్ట్ర సమాచార కమిషనర్ ఐలాపురం రాజా జీవీఎంసీ జోన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత, జవాబుదారీతనంకు ఇస్తున్న ప్రాధాన్యత ఇదేనా ? అని నిలదీశారు. సమాచార హక్కు చట్టం ఉద్యమకర్త కాండ్రేగుల వెంకటరమణ టౌన్ ప్లానింగ్, పరిపాలన, ఇంజినీరింగ్, రెవిన్యూ విభాగాలకు సంబంధించిన సమాచారాన్ని కోరుతూ 2022 నవంబర్ 1న వేర్వేరుగా ఆర్టీఐ చట్టం ద్వారా 5 దరఖాస్తులను జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కార్యాలయానికి దాఖలు చేశారు. అయితే ఏ ఒక్క దరఖాస్తుకు పూర్తిస్థాయిలో అధికార యంత్రాంగాలు సమాచారం ఇవ్వకపోవడంతో మళ్లీ జోనల్ కార్యాలయానికే వెంకటరమణ మొదటి అప్పీళ్లు చేశారు. అయినా జీవీఎంసీ జోనల్ ఆధికారులు స్పందించలేదు. దీంతో రాష్ట్ర సమాచార కమిషన్‌ను ఆయన ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం అయిదు అప్పీళ్లపై వర్చువల్ విధానంలో సమాచార కమిషనర్ ఐలాపురం రాజా విచారణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్తి సమాచారం ఇవ్వకుండా తృతీయ పక్షం, వ్యక్తిగతం అంటూ వాదనలు వినిపించడం సమంజసం కాదన్నారు. విచారణలో జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కమిషనర్ సురె వెంకటరమణ, అసిస్టెంట్ సిటీ ప్లానర్ డి.జాన్సీలక్ష్మి, రెవిన్యూ ఆఫీసర్ ఎల్.సురేష్, అప్పీలుదారు కాండ్రేగుల వెంకటరమణ పాల్గొన్నారు.

విద్యార్థులకు కంచాల పంపిణీ

ప్రజాశక్తి -వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది మెయిన్ స్కూల్‌లో విద్యార్థులకు సిఎల్‌సి చర్చ ఆధ్వర్యాన జెడ్‌పిటిసి దొండా రాంబాబు. శుక్రవారం స్టీలు కంచాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిఎల్‌సి చర్చి అధినేత మొహంతీ దంపతులు, అమెరికాకు చెందిన విదేశీయులు పాఠశాల హెచ్‌ఎం టీవీ శేషగిరిరావు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. 140 స్టీల్ కంచాలను పంపిణీ చేసినందుకు గాను స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులకు, దొండా రాంబాబు పాఠశాల హెచ్‌ఎం టీవీ శేషగిరిరావు ధన్యవాదాలు తెలిపారు.



కంచాలు పంపిణీ చేస్తున్న దృశ్యం



బ్రెయిలీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

అంధులకు ఆదర్శప్రాయుడు బ్రెయిలీ

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : అంధుల పాలిట ఆశా కిరణం, వారికి ఆదర్శప్రాయుడు లూయిస్ బ్రెయిలీ అని దిబ్బిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రధానోపాధ్యాయులు కె. సత్యారావు అన్నారు. పాఠశాలలలో సహిత విద్య విభాగం, స్థానిక భవిత కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకల్లో ఆయన చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి, పుష్పంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతు 17 సంవత్సరాలకే ప్రొఫెసర్ వృత్తిని చేపట్టి, బ్రెయిలీ లిపిని పరిచయం చేసి అంధుల పాలిట ఆశా జ్యోతిగా నిలిచారని చెప్పారు. క్రీడాల్లో గెలుపొందిన దివ్యంగులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు అప్పలరాజు, వెంకట్, పద్మావతి, ప్రమీల, గౌరిబాయ్, జగ్గాప్పారావు, పాఠశాల సిబ్బంది, పోలిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కన్నబాబురాజు సోదరి మృతి


ప్రజాశక్తి- అచ్యుతాపురం : ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు రాజు సోదరి పిన్నమరాజు నారాయణమ్మ శుక్రవారం సాయంత్రం రాంబిల్లి మండల కేంద్రంలో ఆమె స్వగృహంలో మృతి చెందారు. ఆమె అంత్యక్రియలు శనివారం ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నారాయణమ్మ భర్త పిన్నమరాజు సత్యనారాయణరాజు ఎలమంచిలి సమితి ప్రెసిడెంట్‌గానూ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గానూ పని చేశారు. ఆమె మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నబాబు రాజును పలు రాజకీయ పార్టీల నాయకులు పరామర్శ చేశారు.

గురుకుల పాఠశాలకు ఫ్యాన్లు వితరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : పట్టణంలోని బీసీ సంక్షేమశాఖ మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం కాండ్రేగుల శ్రీరామ్ సొంత నిధులతో ఫ్యాన్లను వితరణగా అందజేశారు. గురుకులంలో ఫ్యాన్లు లేకపోవడంతో వేసవి కాలంలో ఉక్కపోత, ఇపుడు దోమల బెడదతో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను తన దృష్టికి తెచ్చిన వెంటనే ఫ్యాన్లను సమకూర్చిన కాండ్రేగుల శ్రీరామ్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ డి వెంకటేశ్వర్లు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ గంగాధర్ ప్రత్యేకంగా అభినందించి, జ్ఞాపికను అందజేశారు. కాండ్రేగుల శ్రీరామ్ మాట్లాడుతూ విద్యార్థి దశ చాలా కీలకమైనదని, గురువులను, తల్లిదండ్రులను గౌరవిస్తూ చిత్తశుద్ధితో సాధనచేస్తే, ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలకు వెళ్తారన్నారు. కార్యక్రమంలో మహేంద్ర పట్నాయక్, పీఈటీ మదన్‌మోహన్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

సూర్యనారాయణను దర్శించుకున్న ఆళ్ల దంపతులు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి శ్రీభోగలింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ ఆళ్ల నాగేశ్వరరావు భారతి దంపతులు శుక్రవారం సుంకరమెట్ట శ్రీ సత్యనారాయణ స్వామి సూర్యనారాయణ స్వాములను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ కర్రి మహాలక్ష్మి నాయుడు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి వేద ఆశీర్వచనం చేయించి దర్శనం చేయించటం జరిగింది. దర్శనానంతరం చైర్మన్ కర్రి మహాలక్ష్మి నాయుడు మీడియాతో మాట్లాడుతూ ఆళ్ల నాగేశ్వర రావు మేము వైయస్సార్సీపి పార్టీ ఆవిర్భావం నుండి పార్టీ కోసం పార్టీ గెలుపు కోసం కషి చేయటం జరిగిందని దాని ఫలితమే ఈ రోజు మమ్మల్ని ఇలా చైర్మన్ల హెూదాలో నిలబెట్టిందన్నారు.



సూర్యనారాయణమూర్తి దేవాలయంలో ఆళ్ల దంపతులు

మాదకద్రవ్యాల రహిత జిల్లాగా అనకాపల్లి

ప్రజాశక్తి- అనకాపల్లి

అనకాపల్లి జిల్లాను మాదకద్రవ్యాల రహిత జిల్లాగా చేసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ రవి పటాన్ శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో శుక్రవారం కలక్టర్ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ లెవల్ కమిటీ ఆఫ్ నార్కో కోఆర్డినేషన్ సెంటర్" సమావేశానికి జిల్లాలోని పోలీస్, సెబ్, ఆర్.టి.సి, రైల్వే, వైద్య ఆరోగ్య శాఖ, అటవీ శాఖ, కోస్ట్ గార్డ్, మెరైన్, జీఆర్పీ, మత్స్య శాఖ తదితర శాఖల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న సాధారణ ఎన్నికల సందర్భంగా సంబంధిత శాఖల సమన్వయంతో డబ్బు, మద్యం, ఉచిత కానుకలు, మాదక ద్రవ్యాలు కట్టడికి ఎన్ఫోర్స్మెంట్ చేయాలని తెలిపారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి మాదక ద్రవ్యాల నివారణకు పోలీసు శాఖతో కలిసి కృషి చేయాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ గంజాయి రవాణా మార్గాలు గుర్తించి అక్కడ 11 డైనమిక్ చెక్ పోస్ట్‌లను ఏర్పాటు చేసి, వాహన తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, అసిస్టెంట్ కమిషనర్ జిఎస్టి ఆర్.ఎస్.వి.ప్రసాద్, జాయింట్ డైరెక్టర్ సెబ్ బి.విజయభాస్కర్, నర్సీపట్నం అదనపు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, కోస్ట్ గార్డు కమాండెంట్ గోవింద్ సరోన్, డి.ఆర్.ఓ దయానిధి, ఆర్డీవో నర్సీపట్నం హెచ్‌వి. జయరాం, డి.ఎం అండ్ హెచ్.ఓ డాక్టర్ హేమంత్, వ్యవసాయ శాఖ జెడి మోహన్ రావు, సాంఘిక సంక్షేమ శాఖ డిడి అజయ్ బాబు, అనకాపల్లి సబ్ డివిజన్ డిఎస్పీ వి.సుబ్బరాజు, డి.సి.ఆర్.బి ఇన్స్పెక్టర్ కె.లక్ష్మణ మూర్తి, నర్సీపట్నం రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పి.రమణయ్య, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ రవి, ఎస్‌పి మురళీకృష్ణ, జెసి జాహ్నవి తదితరులు

గ్రామ కంఠం, ఇరిగేషన్

స్థలాల అమ్మకంపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి

దేవరాపల్లి గ్రామపంచాయతీ పరిధిలో కోట్లాది రూపాయలు విలువ చేసే గ్రామకంఠం, ఇరిగేషన్ స్థలాలను అధికార పార్టీకి చెందిన ముఖ్యనేతలు ఉపముఖ్యమంత్రి అండదండలతో విచ్చలవిడిగా అమ్మకాలు చేస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.వెంకన్న శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గ్రామకంఠాలు అమ్మకాలు కొనుగోలుకు రిజిస్ట్రేషన్ చెల్లుబాటు కావు కాబట్టి పక్కసర్వే నెంబరుతో అమ్మకాలు చేస్తున్నారని, లేదంటే తహశీల్దార్ చేత ఈ స్థలం ప్రైవేటు భూమిగా రాయించుకొని రిజిస్ట్రేషన్ చేస్తున్నారని విమర్శించారు. డాక్యుమెంట్ ఉంటే చాళ్లు అన్నట్టు పంచాయతీ అధికారులు అనుమతి ఇచ్చేస్తున్నారన్నారు. దీంతో మరింతగా రెచ్చిపోయి కోట్లాది రూపాయలు విలువ చేసే గ్రామకంఠాలు, ఇరిగేషన్ భూములను అధికార పార్టీ నాయకులు అమ్మేస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై చర్యలు తీసుకోవలసిన అధికారులు కాసులకు కక్కుర్తిపడి పట్టీపట్టనట్టు వ్యహరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఆక్రమిత స్థలాలను స్వాధీనం చేసుకొని హెచ్చరిక బోర్డులు పెట్టాలని, లేకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని వెంకన్న హెచ్చరించారు.

ఆర్టీసీ విశ్రాంత కార్మికుల నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-అనకాపల్లి

ఏపీఎస్‌ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక శుక్రవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద జరిగింది. అధ్యక్షులుగా విత్తనాల పోతురాజు, ప్రధాన కార్యదర్శి ఎన్‌వివి. సత్యనారాయణ, కోశాధికారి మామిడి విష్ణు, బుగత. శంకర్ రావు, ఉపాధ్యక్షులు బచ్చ సాయికృష్ణ, గునూరు సత్యనారాయణ, సహాయ కార్యదర్శి కొమ్మిరెడ్డి నర్సింగరావు, ప్రచార కార్యదర్శిగా దాసరి లక్ష్మణరావు, కార్యవర్గ సభ్యులుగా పినపాత్రుని సత్యారావు, కోట్ని ఎరకయ్య నాయుడు, వంగా వెంకటగణపతి రెడ్డి, సువ్వారి పాపారావు ఎన్నికయ్యారు. ఈ సందర్బంగా అధ్యక్షులు విత్తనాల పోతురాజు మాట్లాడుతూ పాదయాత్రలో వైఎస్. జగన్ మోహన్ రెడ్డి ఆర్టీసీ రిటైర్డ్ కార్మికులు భార్య భర్తలకు సూపర్ లగ్జారి బస్సులో ఉచిత ప్రయాణం అవకాశం కల్పించిస్తానని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్. వి. వి. సత్యనారాయణ మాట్లాడుతూ ఆర్టీసీ రిటైర్డ్ కార్మికులు విశాంత్రి భవనం ముంజూరు చేయాలన్నారు.

మండల అభివృద్ధికి అమర్‌నాథ్ కృషి

ప్రజాశక్తి- కశింకోట : కశింకోట మండల అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కృషి చేశారని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి మళ్ళ బుల్లి బాబు అన్నారు. శనివారం జరగబోయే పింఛన్ల పంపిణీ కార్యక్రమం కోసం స్థానిక పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనవరి ఆఖరుకు మరో కోటి రూపాయల అభివృద్ధి కార్యక్రమాలు చేయబోతున్నామని చెప్పారు. మరి కొద్ది రోజుల్లో గుడివాడ గురునాథ్‌రావు పేరుతో నిర్మిస్తున్న కళ్యాణ మండపం అమర్నాథ్ చేతుల మీదుగా ప్రారంభమవుతుందని చెప్పారు. కశింకోటలో ఇల్లు లేని నిరుపేదలకు జగనన్న గృహాలు, పేదలకు స్థలాలు అందించినట్లు చెప్పారు. పార్టీలో పదవులు వద్దని ఒక కార్యకర్తగా నిరంతరం సేవ చేయడమే తన బాధ్యతగా భావించి ముందుకు వెళతానని చెప్పారు.



మాట్లాడుతున్న బుల్లిబాబు

ఎస్ఐగా లక్ష్మీనారాయణ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-సబ్బవరం : సబ్బవరం ఎస్సైగా డి.లక్ష్మీ నారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను నాతవరంలో పనిచేసి బదిలీపై ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. శక్తివంచన లేకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు.



లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి- పెందుర్తి

వైసిపి ప్రభుత్వ పాలనలోనే అర్హులైన లబ్ధిదారులకు వారి ఇంటి వద్దకే నేరుగా పింఛను అందుతోందని స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద రూ.మూడు వేలకు పెంచిన పింఛనను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అదీప్‌రాజ్ అందజేశారు.కార్యక్రమంలో ఎంపిపి మధుపాడ నాగమణి, జెడ్‌పిటిసి ఉప్పల దేవి, ఆర్‌డిఒ హుస్సేన్, సర్పంచ్ గొరపల్లి శ్రీను, వైసిపి నేత కనకరాజు, ఎంపిటిసి అప్పలరాజు పాల్గొన్నారు.

తగరపువలస : భీమిలి మండలం, పెద నాగమయ్యపాలెం గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం లబ్ధిదారులకు పెంచిన పింఛన్లను స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పంపిణీ చేశారు. సర్పంచ్ బొడ్డు సత్తమ్మ అధ్యక్షతన జరిగిన సభలో జెడ్‌పిటిసి గాడు వెంకటప్పుడు, ఎంపిటిసి తోట అరుణ, ఎఎంసి చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, మాజీ సర్పంచ్ శరగడర రఘునాథరెడ్డి, వైసిపి నాయకులు బొడ్డు దుర్గారావు, చిల్ల హరి, ఇఒపిఆర్‌డి అప్పలరాజు పాల్గొన్నారు.

నక్కపల్లి : అవ్వా తాతలకు ఇచ్చిన హామీను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిలబెట్టుకుని రూ.3000 పింఛన్ నగదును అందించారని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ అన్నారు. మండలంలో ఉపమాక పంచాయతీలో వైఎస్ఆర్ పెన్షన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ రత్నం, జడ్పిటిసి సభ్యురాలు కాసులమ్మ, సర్పంచ్ ప్రగడ వీరబాబు, వైస్ ఎంపీపీ ఈశ్వరరావు ,విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు కొప్పిశెట్టి హరిబాబు, కొల్లాటి బుజ్జి, మనబాల తాతారావు, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు .

నర్సీపట్నం టౌన్ : ఎన్నికలలో ఇచ్చిన హామీలను 98 శాతం నెరవేర్చిన ఘనత ఒక్క ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ అన్నారు. మండల ప్రజా పరిషత్తు సమావేశ మందిరంలో పెన్షన్ కానుకను ఎమ్మెల్యే అందజేశారు. ఈఎంపీపీ సుర్ల రాజేశ్వరి, సుర్ల చంద్రశేఖర్, మండల పార్టీ అధ్యక్షులు ఎస్‌వివి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ ఇన్నం రత్నం రమణ ఎంపీడీవో జయమాధవి, సర్పంచ్‌లు గొంప కన్నయ్య నాయుడు, వెంకటరత్నం, వేములపూడి పిఎసిఎస్ అధ్యక్షులు గాడి మురళీకృష్ణ, వేములపూడి ఎంపీటీసీ వెంకటేష్ పాల్గొన్నారు.

కోటవురట్ల : పాములవాకలో మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాసరావు, రామచంద్రపాలెం గ్రామంలో ఎంపీటీసీ సభ్యులు రాంబాబు, స్థానిక సర్పంచ్ పరదేశమ్మ పింఛన్ల పంపిణీ చేశారు. గ్రామ కమిటీ అధ్యక్షులు లాలం మహేష్, వైసిపి సీనియర్ నాయకులు కన్నబాబు పాల్గొన్నారు.


గొలుగొండ : సిఎం జగన్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని సిహెచ్.నాగాపురం సర్పంచ్ యలమంచిలి రఘురామచంద్రరావు అన్నారు. గ్రామంలో లబ్ధిదారులతో కలిసి సిఎం జగన్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు.

అనకాపల్లి : ఎన్నికలలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పనిచేశారని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ పేర్కొన్నారు. స్థానిక జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో శుక్రవారం ప్రభుత్వం పెంచిన పింఛన్లను అందజేశారు. హామీలను మరిచిన చంద్రబాబు నాయుడు, హామీలన్నిటిని నెరవేర్చిన జగన్మోహన్ రెడ్డిని బేరీజు వేసుకొని రానున్న ఎన్నికల్లో ఓటర్లు నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీ భీశెట్టి సత్యవతి, వైసిపి నాయకులు మందపాటి జానకరామరాజు, ఏపీఐడబ్ల్యుఏ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, సమన్వయకర్త మలసాల భరత్ కుమార్, నూకంబిక ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, డాక్టర్ రామ్మూర్తి, డాక్టర్ విష్ణుమూర్తి, జోనల్ కమిషనర్ వెంకటరమణ, కార్పొరేటర్ మందపాటి సునీత, ఆళ్ల నాగేశ్వరరావు, జాజుల రమేష్ పాల్గొన్నారు.



పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి తదితరులు

పేదలకు వరం..జగనన్న ఆరోగ్య సురక్ష


గొలుగొండ మండలంలో ప్రారభిస్తున్న జెడ్‌పిటిసి

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని దేవవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ రత్నం, సర్పంచ్ గొర్ల రాఘవ కుమారి, జడ్పిటిసి సభ్యురాలు కాసులమ్మ, నరసింహమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గ్రామస్థాయిలో పేద ప్రజానీకానికి పూర్తిస్థాయిలో వైద్య అందించాలన్న సంకల్పంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గొడిచెర్ల పిహెచ్ సి వైద్యాధికారులు రోగులను పరీక్షించి మందులను అందజేసారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, పిఎసిఎస్ పర్సన్ ఇన్చార్జులు మణిరాజు, పాపారావు పాల్గొన్నారు.

గొలుగొండ:జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు అన్నారు. శుక్రవారం పుత్తడిగైరంపేట గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గజ్జలపు మణికుమారి, మండల పార్టీ అధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, స్థానిక సర్పంచ్ పత్తి రమణ, వైద్యాధికారి డాక్టర్ శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

కశింకోట : జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు ఎంతో మేలు చేస్తుందని వైసిపి అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మలసాల భరత్ కుమార్ పేర్కొన్నారు. కశింకోట డిపిఎన్ హైస్కూల్‌లో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన వైద్యం కోసం కార్పొరేట్ హాస్పిటల్‌కు పంపించడం వలన పేదలకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కలగ లక్ష్మి గున్నయ్యనాయుడు, సర్పంచ్ మంత్రి జయరజిని, వైస్ ఎంపిపి పెంటకోట జ్యోతి, శ్రీనివాసరావు, పంచాయతీ ఈవో రమేష్, డాక్టర్ తిరుపతిరావు, సిబ్బంది పాల్గొన్నారు.


నక్కపల్లి మండలంలో ప్రారంబభిస్తున్న నాయకులు


శిక్షణ ఇస్తున్న డిటి నీరజ

ఇవిఎంలపై అధికారులకు శిక్షణ

ప్రజాశక్తి-నక్కపల్లి:ఈవీఎంల ఉపయోగించే విధానంపై బూత్ లెవెల్ అధికారులు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని డిటి నీరజ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం బూత్ లెవెల్ అధికారులకు ఈవీఎంలు వినియోగించే విధానంపై శిక్షణ ఇచ్చారు. పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు ఉపయోగించే విధానం, మిషన్లు మొరాయిస్తే తీసుకోవలసిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బిఎల్‌ఓలు కిరణ్, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న నేత్ర వైద్యాధికారి

నేత్ర సంరక్షణపై అవగాహన

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లిలో హెటిరో కంటి వైద్యశాలను స్థానిక డిగ్రీ కళాశాల విద్యార్థులు శుక్రవారం సందర్శించారు. ప్రాజెక్ట్‌లో భాగంగా 20 మంది విద్యార్థులు వైద్యశాలను సందర్శించి, కంటి పరీక్షలు, పరికరాలను పరిశీలించారు. నేత్ర వైద్యురాలు రమాదేవి నేత్ర రక్షణ, పరీక్షలపై అవగాహన కల్పించారు.కంటి పరీక్షలు చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ కే శ్రీమన్నారాయణ, అధ్యాపకులు సిహెచ్ అచ్యుతరావు ,ఎం.గణేష్, ప్రాజెక్టు కోఆర్డినేటర్ నరేష్, శ్రీనివాసరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న నేతలు

జనసేన నిరసన

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ అసత్య ప్రచారాలు మానుకోవాలని జనసేన పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎన్టీఆర్ మినీ స్టేడియంలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలియజేశారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర మాట్లాడుతూ,ఎమ్మెల్యే అసలు ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. మెడికల్ కళాశాలకు కేంద్రం అనుమతి లేదని, అనుమతి ఉంటే చూపించాలని ప్రశ్నించారు.ఏరియా ఆసుపత్రిలో వైద్యం అంతంత మాత్రంగా ఉన్నా పట్టించుకోలేదన్నారు. మినీ ఐటిడిఎ తెస్తానని ఇచ్చిన హామీ నెరవేర్చలేదన్నారు. నర్సీపట్నం టౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్ పాల్గొన్నారు.

యుటిఎఫ్ కేలండర్, డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని పలు ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలల్లో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు పి.గాయిత్రి, మండల అధ్యక్షులు చిట్ల అప్పారావు ఆధ్వర్యంలో కేలండర్, డైరీలను ఆవిష్కరించారు. కొత్త మల్లంపేట, చోద్యం హై స్కూల్స్ లో పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో మండల గౌరవ అధ్యక్షులు కోడి రాజుబాబు, కొత్త మల్లం పేట ప్రధానోపాధ్యాయులు కుమారి, చోద్యం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు రత్నాజీ పాల్గొన్నారు.


ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

డ్రెయినేజీ నిర్మాణానికి వినతి

ప్రజాశక్తి-గొలుగొండ:తమ గ్రామంలో డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని పాకలపాడు గ్రామస్తులు ఎంపిడిఒ కార్యాలయ ఏవో బొంతు సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, గ్రామంలో పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్, సచివాలయ సిబ్బందికి సమస్య చెప్పినప్పటికీ పట్టించుకోలేదన్నారు. కనీసం మండల స్థాయి అధికారులు తమకు న్యాయం చేయాలని వారు కోరారు. లేని పక్షంలో ఈ సమస్యని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని గ్రామస్తులు తెలిపారు.


వినతిపత్రాన్ని ఇస్తున్న గ్రామస్తులు

వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్:నాతవరం మండలం మాధవనగరం గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్తలు శుక్రవారం వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్‌గణేష్ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పార్టీ విజయానికి అందరూ పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాతవరం మండల బూత్ కన్వీనర్ రమణ, గ్రామ కమిటీ అధ్యక్షుడు పెంకే రాజు పాల్గొన్నారు.


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే


సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పుస్తకాలు, పెన్నుల పంపిణీ

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని నాన్ భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపిపి గజ్జలపు మణికుమారి హాజరై మాట్లాడుతూ, దివ్యాంగులు మనోధైర్యం, ఆత్మస్థైర్యం ఉంటే ఏదైనా సాధించగలరన్నారు. ఏఎల్ పురం, జోగుంపేట నుండి ప్రత్యేక అవసరాల పిల్లలకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ సత్యనారాయణ, ఏఎల్ పురం హెచ్ఎం నాగభూషణం, జోగుంపేట హైస్కూల్ హెచ్ఎం సరోజిని, జిల్లా సహిత విద్య సమన్వయకర్త శకుంల, ఏఎల్ పురం ప్రత్యేక ఉపాధ్యాయులు తమ్మిల మాణిక్యం, జోగుంపేట ప్రత్యేక ఉపాధ్యాయులు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి-గొలుగొండ:ప్రకృతి వ్యవసాయం పద్ధతులను సకాలంలో పాటించడంతో ఆరోగ్యకరమైన పంటలను సాగు చేయవచ్చునని బిపిటి కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం గింజర్తి జంక్షన్ వద్ద పెట్ల నారాయణమూర్తి పొలంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయంలోని తొమ్మిది ప్రాథమిక సూత్రాలను పాటించడంతో రైతులకు పెద్దగా పెట్టుబడి ఖర్చు లేకుండా నాణ్యమైన దిగుబడి సాధించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో స్వరాజ్య సమితి సమన్వయకర్త వై.నాయుడు, టిడిపి నాయకులు పెట్ల నారాయణమూర్తి, అదపురెడ్డి ప్రభాకరరావు, లగుడు రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

20 లీటర్ల సారా సీజ్

ప్రజాశక్తి-రావికమతం:మండలంలో పిల్లవానిపాలెం గ్రామానికి చెందిన బుద్ది రెడ్డ శివ మద్యం విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఆయన వద్ద ఉన్న 20 లీటర్ల నాటు సారాను సీజ్ చేసి అరెస్టు చేశామని ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అక్రమ మద్యం తయారీ, విక్రయదారులపై ప్రత్యేకమైన డ్రైవ్ నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు.

ఆలయానికి విరాళం

ప్రజాశక్తి-మాడుగుల:ఎం.కోడూరులోని మోద కొండమ్మ ఆలయానికి జనసేన పార్టీ సమన్వయకర్త రాయపరెడ్డి కృష్ణ విరాళం అందించారు. గ్రామంలో మోదకొండమ్మ అమ్మవారి ఆలయం వద్ద నూతన గాలిగోపుర ప్రతిష్టను సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు ఘనంగా నిర్వహించారు. రాయపురెడ్డి కృష్ణ ఆలయ నూతన గాలి గోపురం నిర్మాణానికి రూ 25 వేలు విరాళంగా చెక్కును సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు దంపతులకు అందించారు. కృష్ణను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాడుగుల మండల నాయకులు శివాజీ, అప్పన్న, ప్రసాద్ పాల్గొన్నారు.


దాతను సత్కరిస్తున్న పురోహితులు, నేతలు

టిడిపి నేతల ప్రచారం

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట మండలంలో గల కందిపూడిలో బాబు షుటి భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ద్వారపు రెడ్డి అప్పల నాయుడు , ద్వారపురెడ్డి శంకర్రావు, కొప్పాక రాజు బాబు, ముల్లు రామనాయుడు, గొన్నాబత్తుల శ్రీనివాసరావు, మణికంఠం పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న నాయకులు



పంపిణీ చేస్తున్న యుటిఎఫ్ నేతలు

స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలోని వెంకటాపురం జిల్లా పరిషత్తు పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ అధికారి రామారావు చేతుల మీదుగా స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,పరీక్షా మెటీరియల్ విద్యార్థులు సద్వినియోగం చేసుకుని, మంచి ఫలితాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణ, ఏఎస్ఐ సత్యనారాయణ, యుటిఎఫ్ మండల సెక్రటరీ ప్రసాద్ రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి బాలరాజు

నాయకులు నిరాశ చెందవద్దు

- మాజీ మంత్రి బాలరాజు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:పట్టణంలోని స్వగృహంలో మాజీ మంత్రి బాలరాజును పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు కలుసుకున్నారు. రాబోయే ఎన్నికలలో బాలరాజుకు పాడేరు అసెంబ్లీ టికెట్ వస్తుందని ఆశించిన వీరంతా రాకపోవడంతో నిరాశలో పడ్డారు. . ఈ సందర్భంగా బాలరాజు పార్టీ శ్రేణులతో మాట్లాడుతూ, ఎన్నికలకు ఇంకా చాలా సమయం ఉందని నిరాశ చెందవద్దని పార్టీ శ్రేణులకు ధైర్యం చెప్పారు. తానెప్పుడూ ప్రజల మధ్యే ఉంటానని, వైసిపి పార్టీలోనే పనిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కొయ్యూరు మండలానికి చెందిన మాజీ ఎంపిటిసి కళ్యాణం, చింతపల్లి మండలానికి చెందిన మాజీ ఎంపీపీ ఉల్లి లక్ష్మయ్య, మాజీ ఎంపీటీసీ ఉల్లి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ చిన్నబ్బాయి, లోవరాజు పాల్గొన్నారు.



టీకాలు వేస్తున్న వైద్యుడు

పశువులకు టీకాలు

ప్రజాశక్తి-మాకవరపాలెం:మండలంలోని బూరుగుపాలెం గ్రామంలో ఎంపిపి రుత్తల సత్యనారాయణ పశువులకు టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ, పాడి రైతులు తప్పనిసరిగా పశువులకు టీకాలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి అధికార ప్రతినిధి భీమిరెడ్డి గోవిందరావు, నాయకులు కరక లక్ష్మణ, రుత్తల శ్రీనివాసరావు, పశు వైద్యులు పాల్గొన్నారు.

మిరియాల సాగుపై కళాజాతా

ప్రజాశక్తి-పాడేరు: ఏజెన్సీలో మిరియాల సాగు పై స్పైసెస్ బోర్డు ఆధ్వర్యంలో కాళాజాతా కార్యక్రమాల ద్వారా గిరిజన రైతులకు అవగాహన కల్పిస్తున్నామని స్పైసెస్ బోర్డు సీనియర్ ఫీల్డు అధికారి కళ్యాణి చెప్పారు. శుక్రవారం గుర్రగరువు, మొదపల్లి గ్రామాల్లో కళాజాత కార్యక్రమాలు నిర్వహించారు. మిరియాల సాగులో సస్యరక్షణ, ఆధునిక వ్యవసాయ పద్దతులపై అవగాహన కల్పించారు.

25వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె

- భిక్షాటన, ఒంటికాలిపై నిరసనలు



నర్సీపట్నంలో ఒంట కాలిపై నిరసన

ప్రజాశక్తి - విలేకర్ల బృందం

సమస్యలనను పరిష్కరించాలని అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారం 25వ రోజుకు చేరింది. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఒంటికాలిపై, భిక్షాటన చేస్తూ నిరసన చేపట్టారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి గాంధీ విగ్రహానికి ఎదురుగా ఉన్న రోడ్డులో భిక్షాటన చేస్తూ అంగన్‌వాడీలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షులు వై.తులసి మాట్లాడుతూ అంగన్వాడీల వేతనాలను రూ.26 వేలుకు పెంచాలని డిమాండ్ చేశారు. సమ్మెకు సిఐటియు జిల్లా కార్యదర్శి పి.మణి, జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు పి.వెంకట్ రెడ్డి, మురికివాడల నివాసుల సంక్షేమ సంఘం కార్యదర్శి కె.రవి, ఐఎఫ్‌టియు అనుబంధ అంగన్‌వాడీ యూనియన్ కార్యదర్శి పి.లక్ష్మి పాల్గొన్నారు.

పెందుర్తి : సమస్యల పరిష్కారానికి నిరవధిక సమ్మెచేస్తున్న అంగన్వాడీలు 24వ రోజున శుక్రవారం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్దఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘ నేతలు ఆటాపాటలతో నిరసన తెలిపారు మహిళా సంఘం నాయకురాలు పాడిన పాటలు అందర్నీ ఆకట్టుకున్నాయి. అంగన్వాడీల యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె.బృందావతి మాట్లాడుతూ, ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడమే కాకుండా, సమ్మె చేస్తున్న అంగన్వాడీలను బెదిరించడం, తాళాలు పగలగొట్టి కేంద్రాలను తెరిపించడం వంటి దౌర్జన్యకర చర్యలకు పాల్పడడం దుర్మార్గమన్నారు. రానున్న రోజుల్లో ఆందోళన మరింత తీవ్రం చేస్తామన్నారు. అంగన్వాడీలు భవానీ, దేవి పాల్గొన్నారు.

భీమునిపట్నం : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ వర్కర్లు, సహాయకులు స్థానిక మండలపరిషత్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు,) భీమిలి ప్రాజెక్ట్ గౌరవాధ్యక్షులు కె వెంకటలక్ష్మి, జిల్లా కోశాధికారి కె పద్మావతి, అధ్యక్ష, కార్యదర్శులు శ్రీదేవి, కొవ్వాడ లక్ష్మి పాల్గొన్నారు.

గడ్డితింటూ అంగన్వాడీల నిరసన

దేవరాపల్లి : కనీస వేతనాలు అమలు చేయకుంటే గడ్డి తిని బతకాలా అంటూ దేవరాపల్లిలో అంగన్వాడీలు నోట్లో ఎండి గడ్డి పెట్టి శుక్రవారం నిరసన తెలిపారు. 25వ రోజు ఆందోళన భాగంగా చేసిన ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు జి వరలక్ష్మి, అమ్మాజి, సన్యాసమ్మ, కోమలి, గాయత్రి, రోజా రమణి, జయ, పద్మ, సిఐటియు నాయకులు బిటి దొర, డి వెంకన్న, రైతు సంఘం నాయకులు నాయనబాబు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం బుచ్చియ్యపేటలో అంగన్వాడి వర్కర్లు చెవిలో పువ్వులు పెట్టుకుని ఒంటి కాలుపై నిలబడి నిరసన తెలిపారు. గౌరవ వేతనం మాకొద్దు.. కనీస వేతనం ఇవ్వాలి అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు వరలక్ష్మి, అమ్మాజీ పాల్గొన్నారు.

రాంబిల్లి : మండలం కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో అంగన్వాడీలు చేపట్టిన ఆందోళన 25వ రోజు



విశాఖలో భిక్షాటన చేస్తున్న అంన్‌వాడీలు

చేరింది. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, జి.దేముడు నాయుడు, చందక రామకృష్ణ, అంగన్వాడి యూనియన్ నాయకులు బద్ది మంగ, ఎస్ సుజాత, బి నూకరత్నం, శేషారత్నం, సావిత్రి, రమణమ్మ, సంతోషి పాల్గొన్నారు.

మునగపాక : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రం మునగపాకలో అంగన్వాడీలు చేపట్టిన నిరసన శుక్రవారం నాటికి 25వ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు, యూనియన్ నాయకులు ఏ రామలక్ష్మి, జయలక్ష్మి, హేమలత, ఉమాదేవి, సరస్వతి, అంజలి, గంగాభవాని, నాగమణి, తులసి లక్ష్మి, భవాని తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : స్థానిక నెహ్రూ చౌక్ జంక్షన్లో అంగన్వాడీలు శుక్రవారం నిరసన కొనసాగించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కాసులమ్మ, ఉమా నారాయణమ్మ, తనూజ, కృష్ణవేణి, రామలక్ష్మి పాల్గొన్నారు.



దేవరాపల్లిలో..

పరవాడ : పరవాడ తాసిల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు ఆందోళన కొనసాగింది. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి కోటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, అంగన్వాడి యూనియన్ నాయకులు సుజాత, వెంకటలక్ష్మి, కృష్ణవేణి, నీలిమ, అమ్మాజీ, దేవి, అక్కమ్మ పాల్గొన్నారు.

అచ్యుతాపురం : అచ్యుతాపురంలో శుక్రవారం అంగన్వాడీ కార్యకర్తలు అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేసి,



కోటవురట్లలో...

అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు సంఘీభావం తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తల డిమాండ్లు పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కె. నాగేశ్వరరావు, ఆడారి రామకృష్ణ, పిశ్రీను, సిఐటియు మండల కన్వీనర్ కె సోమునాయుడు, యూనియన్ నాయకులు పి నారాయణమ్మ, ఎన్ వరలక్ష్మి, కే పద్మ, జి జయలక్ష్మి, కే సత్యవతి, ఎం ముచ్చలమ్మ, కె హేమ, పి అంబికా పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడి



బుచ్చయ్యపేటలో..

వర్కర్స్ చేపట్టిన సమ్మె శుక్రవారం నాటికి 25వ రోజుకు చేరింది. మండల పరిషత్ కార్యాలయ సమీపంలో ఏర్పాటు చేసిన రిలే నిరాహారదీక్షకు తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, పలువురు పార్టీ శ్రేణులు సంఘీభావం తెలిపారు. 25 రోజుల నుండి అంగన్వాడీలు శాంతియుతంగా ఆందోళన చేస్తున్నప్పటికీ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం మార్గం చూపక పోవడం దారుణమని వెంకటేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు దుర్గా రాణి, ప్రాజెక్టు అధ్యక్షురాలు సుబ్బలక్ష్మి, యూనియన్ నాయకులు కవిత, లక్ష్మీ రాజ్యం, మంగ లక్ష్మీ, రమణమ్మ, జయ, లక్ష్మీ పాల్గొన్నారు.

మాడుగుల: స్థానిక బస్టాండ్ ఆవరణలో అంగన్వాడి ప్రాజెక్టు యూనియన్ నాయకులు ఆర్.రామలక్ష్మి, డి పార్వతి, వి.ధనలక్ష్మి మాట్లాడుతూ, ఐసిడిఎస్ ప్రాజెక్టుకు నిధులు పెంచాలని, మెరుగైన మెనూ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించి, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం నాన్ షెడ్యూల్ ఏరియా జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరట నరసింహమూర్తి పాల్గొన్నారు.

చీడికాడ:మండల కేంద్రంలో సిఐటియు నేత దేముడు నాయుడు ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె ఆగదని తేల్చి చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే త్వరలోనే ఇంటికి పంపిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జానకి, ఉమా భారతి, పైడితల్లమ్మ, కొండమ్మ పాల్గొన్నారు.

కోటవురట్ల:మండలంలో అంగన్‌వాడీల దీక్షలు కొనసాగాయి. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షురాలు పుష్ప మాట్లాడుతూ, కనీస వేతనాలు చెల్లించే వరకు దీక్షలను విరమించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నమ్మి, సెక్టార్ సభ్యులు పాల్గొన్నారు.

యస్.రాయవరం:స్థానిక తహసిల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడిలు రోడ్డుపై పొర్లు దండాలు పెడుతూ నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, సీతారత్నం, బాల గౌరీ, వెంకటలక్ష్మి, లక్ష్మి, రత్నం, సత్యవతి పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: పట్టణంలో నర్సీపట్నంలో అంగన్వాడీలు ఒంటి కాలిపై నిలబడి నిరసన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ,ఇప్పటికైనా ప్రభుత్వం తన మొండి వైఖరికి విడనాడి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు ఎల్.గౌరి, ఏపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సిఐటియు) ప్రాజెక్టు నాయకులు డి.మహాలక్ష్మీ, సామ్రాజ్యం, వరలక్ష్మీ, శోభా పాల్గొన్నారు.

రావికమతం:మండలంలో అంగన్‌వాడీలు సమ్మె కొనసాగింది. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు కార్యదర్శి సత్యవేణి, పలువురు అంగన్వాడీలు పాల్గొన్నారు.



మాడుగులలో..



పెందుర్తిలో..